
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం, 3 మే 2025



దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

- భూ భారతి నిబంధనల మేరకు వ్యవహరించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మంత్రి పొంగులేటి

6




కూసుమంచి మండలం చేగొమ్మ కొనుగోలు కేంద్రంలో ముద్దయిన ధాన్యం


రఘునాథపాలెం మండలం సూర్యతండాలో నేలమట్టమైన బొప్పాయి తోటను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, ఎంపీ రఘురాంరెడ్డి


నేలరాలిన మామిడి

అర్ధరాత్రి వర్ష బీభత్సం

- నేల రాలిన మామిడి.. తడిసిన వరి
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం
- కన్నీటి పర్యంతమవుతున్న అన్నదాతలు

ఖమ్మం సాంస్కృతికం, మే 2 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం రైతుల కళ్లల్లో కన్నీటికి కారణమైంది.. అర్ధ రాత్రి విరుచుకు పడిన గాలి దుమారం, అకాల వర్షం కారణంగా జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల మామిడి కాయలు రాలి పోగా వరిధాన్యం తడిసిపోయాయి. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 81.6 మిల్లీ మీటర్ల వర్షం కురగా అత్యధికంగా నేల కొండపల్లి మండలంలో 31.4 మిల్లీ మీటర్లు, ఖమ్మం అర్బన్‌లో 9.4, కూసుమంచిలో 9.2, ఖమ్మం రూరల్‌లో 8.6, తిరుమలాయపాలెం 7.8 మిల్లీ మీటర్ల వర్షం నమోదయ్యింది.. కూసుమంచి మండలంలో ఉద్యాన రైతులకు తీవ్ర నష్టం కలిగింది మామిడి కాయలు పెద్ద ఎత్తున నేల రాలి పోవటంతో రైతుల కళ్లల్లో దిగులు మబ్బు ఆవరించింది. మండల పరిధిలోని చేగొమ్మ , ఖమ్మం అర్బన్, రూరల్, తిరుమలాయపాలెం మండలం. కామేపల్లి లోని పలు గ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్న కాయలు అకారణంగా రాలి పోవటంతో రేటు దక్కని పరిస్థితి దాపురించింది.

మామిడి కాపుపై ఆశతో లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి, తోటలను లీజుకు తీసుకొని సాగు ఖర్చులు భరించిన రైతులకు తీరా కాతను తెంపే పరిస్థితులు ప్రకృతి వరుసగా విరుచుకు పడుతుండటంతో గిట్టుబాటు ధరలు దక్కని దుస్థితి దాపురించింది.. మరోవంత వరి రైతులదీ ఇదే పరిస్థితి.. కోత కోసి ఉన్న పనలపైన కుప్పలు నూర్పిన కళ్లాలపైన వాన ప్రతాపం చూపటంతో ధాన్యం రైతులను దైన్యం ఆవరించింది. వరి ధాన్యం వరుసగా తడుపునకు గురవుతుండటంతో నాణ్యత దెబ్బతిని గిట్టుబాటు ధరలు దక్కని (మిగతా 6వ పేజీలో)

నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం

- పంట మార్పిడి విధానం ద్వారా అకాల వర్ష నష్టాలను తగ్గించవచ్చు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

7

పార్టీ కోసం పని చేసిన వారికే పదవులు

- నాకు అలానే జరిగింది
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- సంస్థాగతంగా పార్టీ పటిష్టానికే కమిటీలు
- ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి

వివరాలు : 6లో


సత్తుపల్లిలో జరిగిన పార్టీ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

- ఆదివాసీలతో శాంతి చర్చలు జరపాలి
- బీజేపీయేతర రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు
- నగరంలో మానవహారం, భారీ ర్యాలీ

వివరాలు : 6లో


ఖమ్మం అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం


రామానుజాచార్యులకు ప్రత్యేక అభిషేకం, అర్చన

ఆదిశంకరాచార్యుల వారికి పాదుకాపూజ, అన్నాభిషేకం

7



ఫలరాజు మామిడి సాగును సాంకేతికత, మార్కెటింగ్‌లో మెళకువలు, ఉత్పత్తిలో చిట్కాలతో లాభసాటిగా మార్చుకోవచ్చు. కొత్త పద్ధతిలో మామిడిని పండించటం ద్వారా అధిక రాబడిని ఆర్జించొచ్చు. మామిడికాయకు ప్రొటెక్షన్ బ్యాగ్‌లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నాణ్యమైన, మంచి సైజు, రంగు కలిగిన కాయను ఉత్పత్తి చేయవచ్చు. ఈ ఫ్రూట్ బ్యాగ్‌లతో పండించిన పంటకు చీడపీడలు, రసాయనాల వాడకం తక్కువే. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ఆకర్షణీయమైన ధర లభిస్తుంది. ఎంతో లాభదాయకమైన ఈ విధానం అమలుపై రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్నారు. వారి సూచనలు పాటించి మామిడితోటలను లాభదాయకంగా మార్చుకోవచ్చు.



సంచులు కట్టు నాణ్యత పట్టు

మామిడి సాగులో ఆధునిక విధానంతో సత్ఫలితాలు

- ఫ్రూట్ బ్యాగ్స్ ఏర్పాటుతో చీడపీడల తగ్గుదల
- నాణ్యత పెరుగుతుందంటున్న శాస్త్రవేత్తలు
- అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్
- 70 శాతం అదనపు ధర లభిస్తుందంటున్న ఎగుమతిదారులు
- ప్రయోగాత్మకంగా మంత్రి తుమ్మల వ్యవసాయ క్షేత్రంలో సాగు


లింగాలపల్లిలో ఫ్రూట్స్ బ్యాగ్స్ ఏర్పాటు చేసిన మామిడి చెట్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అశ్వారావుపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు ఎగుమతి అయ్యే నాణ్యత కలిగిన పండును ఉత్పత్తి చేసేందుకు 'ఫ్రూట్ బ్యాగ్ విధానాన్ని ప్రయోగాత్మకంగా దమ్మపేట మండలం, లింగాలపల్లిలోని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ క్షేత్రంలో అమలు చేశారు. ఫ్రూట్ బ్యాగ్స్ ఏర్పాటుతో మంచి రంగు, సైజు, నాణ్యతతో పండిన మామిడిని సౌదీ అరేబియా, రియాద్ వంటి దేశాలు ఎగుమతి చేసేందుకు రెండు రోజులుగా కోతను ప్రారంభించారు. ఫ్రూట్స్ బ్యాగ్స్ రక్షణలో ఎదిగిన మామిడికాయలను అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ హేమంత్‌కుమార్, హార్టికల్చర్ శాస్త్రవేత్త నీలిమ, పైథాలజిస్ట్ దీపక్‌రెడ్డి, ఉద్యాన పరిశోధన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ విజయకృష్ణ, దమ్మపేట ఉద్యాన శాఖాధికారి సందీప్ ఎకుమార్ పరిశీలించారు. ఫ్రూట్ బ్యాగ్స్ ఏర్పాటుతో కాయ నాణ్యత, సైజు, రంగు ఎలా పెరిగిందో పరిశీలించారు. తోట సైజును బట్టి 40 నుంచి 70శాతం మామిడి పిందెలు 2- 3 సెం.మీ. సైజు వచ్చిన ప్రొటెక్షన్ బ్యాగ్స్‌ను ఏర్పాటు చేసుకోవచ్చునని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ బ్యాగ్స్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీలను కూడా అందిస్తుందని, వచ్చే ఏడాది నుంచి 'మామిడి (మిగతా 6వ పేజీలో)

అంతర్జాతీయ మార్కెట్‌ను అందిపుచ్చుకోవాలి

హేమంత్‌కుమార్, అసోసియేట్ డీన్, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల



మామిడిలో చీడ పీడలు, పురుగు ఉధృతిని తగ్గించడం ద్వారా ఎక్స్‌పోర్ట్‌కు అవసరమైన కాయను పండించుకోవచ్చు. కాయ ఎక్స్‌పోర్ట్ క్వాలిటీకి రావడానికి కాయకు బ్యాగ్‌లు తొడిగే విధానం ప్రధానమైనది. ఈ బ్యాగ్ వినియోగం వల్ల రసాయనకాల వాడకాలు తగ్గి, మానవాళికి, వాతావరణానికి మేలు జరుగుతుంది. రైతులు అంతర్జాతీయ మార్కెట్‌ను అందిపుచ్చుకోవాలి.

ఖర్చు, శ్రమ తగ్గుదల

ఫ్రూట్ బ్యాగ్‌ల ఏర్పాటు వల్ల కాయను తేనెమంచు, తామర పురుగు, రసం పీల్చే పురుగు వంటివి ఆకర్షించకుండా కాపాడుతుంది. ట్రాప్‌ల ఏర్పాటు వల్ల కొన్ని రకాల పురుగులు కాయను తాకవు. పండు ఈయ, టెంకెకు పురుగు నుంచి రక్షణ లభిస్తుంది. చీడ పీడ, పురుగుల ఉధృతిని తగ్గించేందుకు వినియోగించే రసాయనాలను 60-70 శాతం మేర తగ్గిపోతుంది. రైతుకు ఖర్చు, శ్రమ తగ్గుతుంది. కోసిన మామిడికాయను ఇరాడియేషన్ సెంటర్‌లో గామారేడియషన్, వేపర్‌హీట్ ట్రీట్‌మెంట్‌లో శుభ్రం చేసి, కూలింగ్‌లో ఉంచి ప్రతి కాయకు ఎక్స్‌పోర్టర్స్ సమక్షంలో స్టాంపులు వేసి నాలుగేసి కిలోల చొప్పున బ్యాగ్‌లలో ప్యాక్ చేసి విదేశాలకు ఎగుమతి చేస్తారు. ఈ ఇరాడేషన్ సెంటర్ ఇప్పటి వరకు మనకు దగ్గరలో బెంగళూరులో మాత్రమే ఉంది.



నేడు, రేపు డిప్యూటీ సీఎం పర్యటన

మధిర టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శని, ఆదివారం మధిర నియోజకవర్గంలో పర్యటించనున్నారు. శుక్రవారం రాత్రి ఖమ్మం లోని క్యాంపు కార్యాలయానికి చేరుకోనున్న భట్టి శనివారం ముదిగొండ మండల కేంద్రంలో 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపనతోపాటు మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు మధిరకు చేరుకుని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. శనివారం రాత్రి మధిరలో బసచేసి ఆదివారం ఉదయం క్యాంపు కార్యాలయంలో పలువురిని కలుసుకున్న అనంతరం 9 గంటలకు మధిర నుంచి హైదరాబాద్‌కు వెళ్తారు.

క్రీడా వసతుల కల్పనకు కృషి

- రఘునాథపాలెంలో క్రికెట్ గ్రౌండ్‌కు 20ఎకరాలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఎస్పీ స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్‌కు శంకుస్థాపన


టేబుల్ టెన్నిస్ ఇండోర్ హాలుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం స్పోర్ట్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే జిల్లా క్రీడా రంగం ముందుండాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సుమారు రూ. 8.50 కోట్ల నిధులతో 8 వరుసల సింథటిక్ ట్రాక్, రూ.50లక్షలతో టేబుల్ టెన్నిస్ ఇండోర్ హాల్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్రీడలను ప్రోత్సహించేందుకు, క్రీడాకారులకు కావాల్సిన అన్ని వసతులను కల్పించేందుకు ప్రభుత్వం తరుపున అన్ని సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఇప్పటి వరకు మన రాష్ట్రంలో సింథటిక్ ట్రాక్‌లు 5 ఉన్నాయని ఇప్పుడు ఖమ్మంలో 6వ ట్రాక్ క్రీడాకారులకు అందుబాటులోకి వస్తుందని అన్నారు. జిల్లా క్రీడాకారులు మట్టి ట్రాక్‌పై సాధన చేసి చాలా పతకాలు సాధిస్తున్నారు. త్వరలో సింథటిక్ ట్రాక్‌పై సాధన చేసి మరిన్ని పతకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రాక్ నిర్మాణం నుంచి దాని నిర్వహణ ప్రణాళికాబద్ధంగా ఉండాలని, మంచి నైపుణ్యం కలిగిన కోచ్‌లను నియమించాలని అధికారులను ఆదేశించారు. రఘునాథపాలెం మండలంలో క్రికెట్ గ్రౌండ్ కోసం 20ఎకరాలు కేటాయించాలని ఆయన ఆర్‌డీవో నర్సింహరావును సూచించారు. ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ తాను కూడా క్రీడా పోటీల్లో పాల్గొన్నానని 1979-80లలో 400మీటర్ల పరుగు పందెంలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించానని అన్నారు. సింథటిక్ ట్రాక్ నిర్మాణం జరగడం జిల్లా క్రీడాకారులకు వరం అని అన్నారు. స్టేడియంలో సింథటిక్ ట్రాక్ మధ్యలో హాకీ ట్రాక్‌ను ఏర్పాటు చేయడానికి అవకాశం ఉంటే పరిశీలించాలని అధికారులను కోరారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ సరిగ్గా 25ఏళ్ల క్రితం సర్దార్ పటేల్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల నేడు అదే స్టేడియంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు రోజూ అరగంట నుంచి గంట సమయం కేటాయించాలని కోరారు.

అనంతరం గత డిసెంబరు నెలాఖరులో జరిగిన సీఎం కప్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కార్పొరేటర్ కమర్తపు మురళి, మాజీ కార్పొరేటర్ చావా నారాయణరావు, కాంగ్రెస్ నాయకుడు సాధు రమేష్‌రెడ్డి, రైతు సంఘం నాయకుడు నల్లమల వెంకటేశ్వరరావు, డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, క్రీడా సంఘాల బాధ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.



కేఎన్‌ఎం-1638 ధాన్యానికీ డిమాండ్

- హనుమకొండ జిల్లా మిల్లర్ల రాకతో మారిన సీన్
- ఖమ్మం జిల్లా పరిధిలోని మిల్లర్లు కూడా సుముఖత
- మొన్నటివరకు పేచీలు పెట్టి కొనుగోలు చేయని వైనం
- నల్గొండ వ్యాపారులకూ కేటాయించాలంటున్న రైతులు

వైరా, మే 2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పరిధిలోని మిల్లర్లు గురువారం వరకు కేఎన్‌ఎం 1638 సన్నరకం ధాన్యం దిగుమతులకు ఏమాత్రం ఆసక్తి చూపలేదు. అయితే శుక్రవారం నుంచి కొంతమంది మిల్లర్లు కేఎన్‌ఎం 1638 ధాన్యాన్ని దిగుమతి చేసుకొనేందుకు ఆసక్తిని ప్రదర్శిస్తున్నారని పౌరసరఫరాల శాఖ అధికారులు చెపుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రబీ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి జిల్లాలోని (మిగతా 6వ పేజీలో)

స్వర్ణభద్ర కవచాలతో రామయ్య దర్శనం

భద్రాచలం, మే 2 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారు శుక్రవారం స్వర్ణభద్రకవచాలతో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

వైశాఖమాసంలో జరిగే ఉత్సవాలివే

భద్రాద్రి రామాలయంలో వైశాఖమాసంలో జరిగే ఉత్సవాలివే. 3న మూలమూర్తులకు ప్రత్యేక అభిషేకం, పాదుకాపూజ, పునర్వసు దీక్ష విరమణ, సంక్షేప రామాయణ హవనం నిర్వహించనున్నారు. 4న స్వామి వారికి పట్టాభిషేకం, 8న సత్యనారాయణస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం, 9న సంధ్యాహారతి, 10న ఆళ్వార్లకు చుట్టు సేవ, 22న హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక అభిషేకం, తమలపాకులతో పూజ, 23న లక్ష కుంకుమార్చన, విశేష సేవ నిర్వహించనున్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్

విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషిచేయాలి

ఏన్కూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలాల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అధ్యాపకులు నిరంతరం కృషిచేయాలని ఇంటర్ బోర్డు క్షేత్ర పరిశీలకులు, డిప్యూటీ డైరెక్టర్ యాదగిరి అన్నారు. శుక్రవారం ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలాను సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో అడ్మిషన్లు, పరీక్ష ఫలితాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో అడ్మిషన్లపై ప్రచారం చేపట్టాలని కోరారు. నిబద్ధతతో పనిచేసి ఉత్తీర్ణత శాతం పెంపునకు కృషిచేయాలన్నారు. ప్రభుత్వ విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులకు వివరించాలన్నారు. అనంతరం కళాశాల పరీక్షా ఫలితాలు, కళాశాల సౌకర్యాలు తెలిపే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం, అధ్యాపకులు సుందర్ కృష్ణప్రసాద్, బాబూలాల్, రామారావు, ఎల్‌వీ రావు, రాజన్న, నవీన్, కవిత, లావణ్య, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిళ్ల ప్రపంచానికి నవ్వుల వైద్యం..



- నవ్వు నలభై విధాల గ్రేటు..
- నవ్విస్తూ ఆరోగ్యం పంచుతున్న కామెడీ కళాకారులు

ఖమ్మం సాంస్కృతికం, మే 2 (ఆంధ్రజ్యోతి): నవ్వటం ఒక భోగం.. నవ్వించటం ఒక యోగం.. ఇది ఆధునిక జీవన శైలికి అతిచేరువగా ఉన్న సిద్ధాంతం.. నవ్వు ద్వారా మానసిక వత్తిళ్లు దూరం అయ్యే అవకాశం ఉండటంతో ఇటీవల నవ్వుకు ప్రాధాన్యత పెరిగింది. టెలివిజన్ చానెళ్లలో హాస్య ప్రధానమైన కార్యక్రమాలు దశాబ్దాల తరబడి కొనసాగుతున్నాయి. పెద్ద పట్టణాలు, మహానగరాల్లో లాఫ్టర్ క్లబ్బులు సైతం ఏర్పాటు కావటం విశేషం. ప్రతి ఏటా మే మొదటి ఆదివారాన్ని ప్రపంచ నవ్వుల దినంగా జరుపుకొంటున్నారు. మొదటిసారిగా మనదేశంలో 1998 జనవరి 10న లాఫ్టర్ క్లబ్ ఇంటర్నేషనల్ తరుపున డాక్టర్ మదన్ కటారియా ప్రారంభించారు. జనవరిలో చలి అధికంగా ఉండడంతో దాన్ని మే నెలకు మార్చారు. నవ్వును



జబర్దస్త్ కళాకారులతో ఈశ్వర్

యోగాగా మార్చి ప్రజల్లో ఆరోగ్య అవగాహనను పెంపొందిస్తున్నారు. 2000 జనవరి 9న డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగ్‌లో మొదటిసారి నవ్వుల దినోత్సవం జరిపారు.

జిల్లా కమెడియన్లకూ పుట్టిల్లు..

జిల్లాకు చెందిన పలువురు కమెడియన్లు తమ హాస్యంతో ప్రజలకు వినోదం పంచుతున్నారు. నవ్వుల దినోత్సవం సందర్భంగా వారి పరిచయం..

ఖమ్మం జాకీ ఈశ్వర్ బహదూర్...

ఖమ్మంకు చెందిన ఈశ్వర్ బహదూర్ ఖమ్మం జాకీ చాన్‌గా సుప్రసిద్ధ హాస్య దర్శకుడు జంధ్యాలతో బిరుదు పొందటం విశేషం. రూపంలో కొంత జాకీచాన్‌ను పోలి ఉండటంతోపాటు జాకీచాన్ మాదిరిగా సునిశిత హాస్యాన్ని పండిస్తుండటంతో ఈ బిరుదు దక్కింది. 30ఏళ్ల క్రితం ఒక టెలీవిజన్ చానెల్‌లో ధర్మవరపు సుబ్రమణ్యం, గౌతం రాజు, కొండవలస, అనంత్ తదితరులు పాల్గొన్న కార్యక్రమంలో ఖమ్మం జిల్లానుంచి పలువురు కళాకారులు



బ్రహ్మానందం నుంచి క్యాష్ ప్రైజ్ తీసుకుంటున్న మొగిలి గుణకర్



భద్రం

రేపు ప్రపంచ నవ్వుల దినోత్సవం..

పాల్గొని హాస్య కార్యక్రమాలు ప్రదర్శించారు. వారిలో ఈశ్వర్ బహదూర్ విన్నర్‌గా నిలిచాడు. పలు చిత్రాల్లో, టీవీ షోలలో కూడా తన హాస్యాన్ని ప్రదర్శించాడు.

పాతికేళ్ల హాస్య ప్రస్థానం మొగిలి..

జిల్లాలోని వైరా మండలానికి చెందిన మొగిలి గుణకర్ పాతికేళ్లుగా హాస్యంలో తనదైన గుర్తింపు సాధించాడు. కమెడియన్‌గా, పేరడి సింగర్‌గా హాస్యాభిమానులను అలరిస్తున్నాడు. పదోతరగతిలోనే ముఠా మేస్త్రి సినిమాలోని ఈ పేటకు నేనే మేస్త్రిరి అన్న పాటను ఈ క్లాసుకునే నేనే లీడరు అనే పేరడీగా మార్చి విద్యార్థులు, ఉపాధ్యాయులను నవ్వించాడు. తండ్రి నుంచి అబ్బిన కళకు మరింత పదును పెట్టి పలువురు సినీ కమెడియన్లు, హాస్య దర్శకుల మన్ననలు పొందాడు. 2018లో దగ్రేట్ లాఫ్టర్ ఛాలెంజ్ అనే టీవీ కార్యక్రమంలో పాల్గొని విన్నర్‌గా నిలిచి హాస్య బ్రహ్మ బ్రహ్మానందం చేతుల మీదుగా అవార్డు పొందాడు.

బ్రహ్మానందం మన్ననలు పొందిన భద్రం

ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన భద్రం హాస్య మెగాస్టార్ బ్రహ్మానందంతో నటించే అరుదైన అవకాశాన్ని పొందాడు. ఎస్వీ కృష్ణారెడ్డి రూపొందించిన మస్త్ అనే సినిమాలో బ్రహ్మానందంతో కలిసి ఫుల్‌లెంత్ పాత్రలో నటించాడు. సంధింగ్, సంధింగ్ అనే మరో సినిమాలో సైతం కామెడీ పండించాడు. సామాజిక అంశాలపై ప్రజలను చైతన్యపరిచే అనేక కార్యక్రమాలకు వాఖ్యాతగా కళాకారుడిగా వ్యవహరించిన భద్రం ప్రస్తుతం ప్రభుత్వ సారధి కళాకారుడిగా సేవలందిస్తున్నాడు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

- గ్రామాల్లో పర్యటించనున్న వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తల బృందం
- కళాశాల అసోసియేట్ డీన్ హేమంత్‌కుమార్ వెల్లడి

అశ్వారావుపేట, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మే 5వ తేదీ నుంచి జూన్ 13 వరకు ఆరు వారాలపాటు గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తారని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.హేమంత్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం ఆయన ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. కళాశాలకు చెందిన శాస్త్రవేత్తలు 8 బృందాలుగా ఏర్పడి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 48 గ్రామాల్లో ఈ కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

న్యాయవాద సంక్షేమ సంఘం ఎన్నికల విజేతలు వీరే...

ఖమ్మంలీగల్, మే 2 (ఆంధ్రజ్యోతి): న్యాయవాద సంక్షేమ సంఘం ఎన్నికల్లో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 429 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తం 549. నాలుగు డైరెక్టర్ పదవులకు గాను ఆరుగురు అభ్యర్థులు పోటీపడగా ఆవుల అనురాధ, షేక్ నస్రీన్, కాసర రాజశేఖరరెడ్డి, పాలవెల్లి వెంకటేశ్వర్లు గెలిచినట్లు ఎన్నికల అధికారి జి.రమేష్ తెలిపారు. గెలుపొందిన డైరెక్టర్లను బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తాండవ వెంకటేశ్వరరావు, గద్దల దిలీప్‌కుమార్‌లతోపాటు పలువురు న్యాయవాదులు అభినందించారు.

ఆర్సీవోగా బాధ్యతలు చేపట్టిన అరుణకుమారి



భద్రాచలం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రీజియన్ గురుకులాల సమన్వయ అధికారిణిగా అరుణకుమారి శుక్రవారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఐటీడీఏ పీవో బిరాహుల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు.

70 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, మే 2 (ఆంధ్రజ్యోతి): 2025-26 వన మహోత్సవంలో 70లక్షల మొక్కలు నాటడమే లక్ష్యమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయం సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో వనమహోత్సవంపై ఐటీడీఏ పీవో రాహుల్, అటవీశాఖాధికారి కృష్ణ గౌడ్‌తో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పచ్చదనం పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏటా మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపడుతోందని, అన్ని శాఖలకు లక్ష్యాలను నిర్దేశించారు. ఈ ఏడాది వనమహోత్సవం కార్యక్రమంలో రైతులకు, ఇంటి ఆవరణ, రహదారుల వెంట, కెనాల్ బండ్ ప్లాంటేషన్ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అత్యధికంగా జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖకు 30లక్షల మొక్కలు, టీజీఎఫ్‌డీసీశాఖకు 12లక్షల మొక్కలు, అటవీశాఖ 10లక్షలు, సింగరేణి 10లక్షలు, ఉద్యానవనశాఖ 5.7లక్షలు, వ్యవసాయ శాఖ 5లక్షలు, ఇరిగేషన్ 2లక్షల మొక్కలు నాటాలని లక్ష్యాలను నిర్దేశించారు. వన మహోత్సవంలో భాగంగా నాటే మొక్కలు ఎక్సైజ్ శాఖ అధికారులు తాటి, ఈత చెట్లను నాటాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటేందుకు స్థలాలు గుర్తింపు, గుంతల తవ్వకం చేపట్టాలన్నారు. మొక్కలు నాటడంతోపాటు మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, నాటిన ప్రతి మొక్కకు జియోట్యాగింగ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, జిల్లా వైద్యశాఖ అధికారి భాస్కర్‌నాయక్, జిల్లా ఉద్యానశాఖాదికారి కిషోర్, ఇరిగేషన్ ఈఈ అర్జున్‌రావు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, జిల్లా పరిశ్రమల శాఖాధికారి తిరుపతయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హుల జాబితాను పకడ్బందీగా రూపొందించాలి

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్

బూర్గంపాడు, మే 2 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం కోసం నిరుద్యోగులైన గిరిజన యువతీ యువకులు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారి జాబితా పకడ్బందీగా రూపొందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వేపలగడ్డ, నకిరిపేట గ్రామాల్లోని పంచాయతీలలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలనను ఆయన పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి జాబితా రూపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా గిరిజన నిరుద్యోగుల దరఖాస్తులను చాలా క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి తప్పనిసరిగా రుణాలు అందే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో ఏంపీడీవోలు, బ్యాంకు మేనేజర్లు కమిటీ సభ్యులు ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారి జాబితా రూపొందించాలన్నారు. బ్యాంకర్ల సమన్వయంతో ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్, పట్టాదారు పాస్ పుస్తకం, సదరం సర్టిఫికెట్, ఇతర ధ్రువీకరణ పత్రాలను పరిశీలించాలని అన్నారు. జనాభా ప్రాతిపదిక కలిగిన యూనిట్ల కేటాయింపు ఉంటుందని ఒకే గ్రామంలో ఒక యూనిట్‌కు ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకుంటే వాటిని పరిశీలించాలని, వ్యవసాయ సంబంధిత యూనిట్ల స్థాపనకు ప్రజలకు అవగాహన కల్పించాలని చేపల పెంపకం యూనిట్లను ఈ పథకం ద్వారా స్థాపించడం ద్వారా వారిలో పురోగతి ఉంటుందని అన్నారు. అదే విధంగా పాడి పరిశ్రమలు స్థాపనను ప్రోత్సాహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, ఏస్‌వో భాస్కర్, స్పెషల్ ఆఫీసర్ అశోక్‌కుమార్, ఏంపీవో బాలయ్య, వేపలగడ్డ, నకిరిపేట గ్రామ పంచాయతీ కార్యదర్శులు బిందు, రుక్మిణి పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

- భూ భారతి నిబంధనల మేరకు వ్యవహరించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం, మే 2 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం ప్రజల నుండి అందిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఆయన, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు,సీసీఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్‌తో కలిసి భూ భారతి చట్టం, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, నీట్ యూజీ. ప్రవేశ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, కొత్తగూడెం ఆర్డీవో మధు, హౌసింగ్ పీడీ శంకర్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు క్రింద చేపట్టిన 4 మండలాల్లో రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై ప్రజల నుంచి 12 వేల 759 దరఖాస్తులు వచ్చాయని, భవిష్యత్తులో జరిగే రాష్ట్ర వ్యాప్త రెవెన్యూ సదస్సులలో ఎక్కువ మొత్తంలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరిస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని అన్నారు. భూ భారతి చట్టంలో దరఖాస్తు చేసుకునే సమయంలో సరిగ్గా దరఖాస్తు నమోదు అయ్యేలా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని అన్నారు. భూసేకరణ క్రింద ప్రభుత్వం సేకరించిన భూముల రికార్డులు అప్‌డేట్ చేయాలని మంత్రి కలెక్టర్ లను ఆదేశించారు. మే నెల చివరి వరకు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా పరిష్కారం చూపాలని మంత్రి తెలిపారు.

ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన నిరుపేదలకు కేటాయించాలని, ఇందిరమ్మ కమిటీల నుంచి వచ్చిన లబ్ధిదారుల జాబితాను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చెక్ లిస్ట్ రూపొందించుకొని తుది జాబితాను తయారు చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు మాట్లాడుతూ భూ భారతి చట్టం పైలెట్ ప్రాజెక్టు క్రింద వచ్చిన దరఖాస్తులను చట్టం ప్రకారం పరిష్కరించాలని సూచించారు. నీట్ యూజీ. ప్రవేశ పరీక్షలపై గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 5 నుంచి మే 20 వరకు పైలెట్ ప్రాజెక్టు జిల్లాలు మినహాయించి మిగిలిన జిల్లాల్లో ఒక మండలాన్ని పైలెట్‌గా తీసుకుని గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. జూన్ 2 వరకు పైలెట్ ప్రాజెక్టు కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి కషి చేయాలని తెలిపారు.

ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ నేలకొండపల్లి మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో 23 రెవెన్యూ గ్రామాల నుంచి 3 వేల 224 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 1264 సాదా బైనమా దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కటాఫ్ తేది 2 జూన్ 2014 తర్వాత 700 మంది, కటాఫ్ తేది లోపు ఉన్న దరఖాస్తులు 564 ఉన్నాయని, వీటిలో 264 ఆన్ లైన్ దరఖాస్తులు చేసుకున్నారని, క్షేత్రస్థాయి తనిఖీలలో 30 మంది మాత్రమే ఫీల్డ్ లో ఉన్నారని తెలిపారు. భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, క్షేత్రస్థాయిలో అధికారులు దరఖాస్తులు పరిశీలించి సంతకం చేయడం ద్వారానే లబ్ధిదారులను గుర్తింపు చేపడుతున్నామన్నారు. పేదల్లో బహుపేద వారికి మాత్రమే లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 2 (ఆంధ్రజ్యోతి): మధ్య భారతదేశంలో ఆపరేషన్ కగార్ పేరుతో అటవీ ప్రాంతాల్లోని ఆదివాసీలను కేంద్ర పోలీసు బలగాలు విచక్షణా రహితంగా హతమారుస్తున్నారని ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలుపుదల చేసి ఆదివాసీలతో శాంతి చర్చలు జరపాలని బీజేపీయేతర రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కోరాయి. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా శుక్రవారం ఖమ్మంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు కాకి భాస్కర్, రవిమారుత్, సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంత రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు మాట్లాడారు. అటవీ ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపదను ఆదాని, అంబానీలకు కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు ఆదివాసీలపై దాడులు జరుగుతున్నాయి. దండకారణ్యాన్ని కేంద్ర బలగాలు స్వాధీనం చేసుకున్నాయని ఆరోపించారు. పారామిలిటరి బలగాలు, గ్రేహౌండ్స్ దళాలు, సీఆర్పీఎఫ్ బస్తార్ ఫైటర్స్, సీ 60 కమాండాలు కలిసి ఆదివాసీలపై కేంద్ర ప్రభుత్వం ప్రయోగించిందన్నారు.

దేశ రక్షణ కోసం వినియోగించాల్సిన మిలిటరీ బలగాలను ఆదివాసీలను అడవుల నుంచి ఖాళీ చేసేందుకు వాడుతున్నారని ఆరోపించారు. ఆదివాసీలు కూడా ఈ దేశ పౌరులు అనే విషయాన్ని విస్మరించకూడదన్నారు. మావోయిస్టులను తుద ముట్టడించటమే తమ విధానమని కేంద్ర రక్షణ మంత్రి ప్రకటించి అప్రజాస్వామికంగా పేర్కొన్నారు. మరోవైపు శాంతి చర్చలకు మావోయిస్టు పార్టీ సిద్ధంగా ఉన్నామని ప్రకటించిన కనీస దయాదక్షణం లేకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తొందని ఆరోపించారు. అందుకే రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకరావాలని వారు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎన్డీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, టీజేసీ రాష్ట్ర నాయకులు గోపగాని శంకర్‌రావు, తెలంగాణ పీపుల్స్ జేఏసీ జిల్లా కన్వీనర్ దేవిరెడ్డి విజయ్, జర్నలిస్టు నాయకులు చిర్రా రవి, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు కిషన్‌నాయక్, డాక్టర్ గోపీనాథ్, స్వర్ణసుబ్బారావు, యలమంచిలి రవీంద్రనాథ్, యాలముడి కృష్ణయ్య, వీరభద్రం పాల్గొన్నారు.

సంచులు కట్టు.. నాణ్యత పట్టు..

(5వ పేజీ తరువాయి)

ఇరాడియేషన్ సెంటర్ హైదరాబాద్‌లోనే అందుబాటులోకి వస్తుందని వివరించారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకునేందుకు రైతులు ఉద్యానశాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

విదేశాల్లో అధిక డిమాండ్...

మామిడిలో అన్ని రకాల పండ్లు విదేశాలకు ఎగుమతి అవుతాయి. ఒక్కో దేశంలో ఒక్కో రకం కాయకు డిమాండ్ ఉంటుంది. బంగినపల్లి రకం మామిడికి మూడొంతులకు పైగా డిమాండ్ ఉంటుంది. యూఎస్ఏ, గల్ఫ్ దేశాలు, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్, యునైటెడ్ కింగ్‌డమ్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో మామిడికి డిమాండ్ ఉంది. మన దేశంలో వినియోగించే మామిడికన్నా విదేశాలకు ఎగుమతి అయ్యేవే ఎక్కువగా ఉంటాయి. పక్కన ఉన్న కొన్ని రాష్ట్రాలకు కూడా రాష్ట్రంలో పండిన మామిడి ఎగుమతి అవుతుంది.

రూ.25వేల ప్రోత్సాహకం: సందీప్, ఉద్యాన అధికారి, దమ్మపేట

ఫ్రూట్ బ్యాగ్ ఏర్పాటు చేసుకోవడానికి ఒక్కో రైతులకు హెక్టారుకి రూ.25వేల చొప్పున రెండున్నర హెక్టార్ల వరకు ప్రభుత్వం ప్రోత్సాహకం అందజేస్తుంది. ఫ్రూట్ బ్యాగ్‌లు ఏర్పాటు చేసుకునేవారు ముందుకు ఉద్యానశాఖ యాప్‌లో రిజిస్టర్ చేయించుకోవాలి.

నాణ్యమైన మామిడి: ఎం.ఘని, ఫ్రూట్ ఎక్స్‌పోర్టర్

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫ్రూట్ బ్యాగ్ ఏర్పాటు చేసిన మామిడి తోటను ఉద్యానశాఖ యాప్‌లో చూశా. దీని ద్వారా తోటను సందర్శించా. 50శాతానికి పైగా కాయకు బ్యాగ్‌లు తొడిగారు. నాణ్యత బాగుంది. ఈ కాయను కోసి గ్రేడింగ్ చేసి సౌదీ అరేబియా, రియాద్ దేశాలకు ఎగుమతి చేస్తున్నాం.

కేఎన్ఎం-1638 ధాన్యానికీ డిమాండ్

(5వ పేజీ తరువాయి)

మిల్లులకు మాత్రమే కేటాయింపులు చేశారు. ఇదే అదునుగా జిల్లాలోని మిల్లర్లు ధాన్యం తరుగుకోసం అనేక పేచీలు పెడుతూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసి ధాన్యాన్ని దిగుమతి చేసుకోలేదు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఇతర జిల్లాల్లోని మిల్లులకు ధాన్యం దిగుమతుల కేటాయింపులు ఇవ్వడానికి ముందు ఆసక్తి చూపలేదు. ధాన్యం కొనుగోళ్లపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి రావడంతో ప్రభుత్వానికి నిఘా విభాగాల నుంచి నివేదికలు అందిన వెంటనే ఖమ్మంజిల్లాలోని ధాన్యాన్ని హన్మకొండ జిల్లాలోని మిల్లులకు కేటాయింపులు చేశారు. సన్నరకం ధాన్యం దిగుమతులకు 16 మిల్లులు, దొడ్డురకం ధాన్యం దిగుమతులకు 14 మిల్లులకు అలాట్‌మెంట్ ఇచ్చారు. హన్మకొండ జిల్లాలో రబీ వరిపంట లేకపోవడంతో ఖమ్మం జిల్లా నుంచి వచ్చిన ధాన్యం మొత్తాన్ని దిగుమతి చేసుకొనేందుకు అక్కడి మిల్లర్లు ఆసక్తి చూపుతున్నారని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు చెపుతున్నారు. ఒక్కో మిల్లులో ఏమాత్రం ఆలస్యం లేకుండా రోజుకు 10 నుంచి 15 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసుకొనేందుకు మిల్లర్లు ముందుకొచ్చినట్లు సమాచారం.

వైరా, తల్లాడ తదితర ప్రాంతాల్లోని రైతులు ఈ రబీలో పండించిన కేఎన్ఎం 1638 రకం ధాన్యాన్ని తీసుకొనేందుకు మిల్లర్లు ముందుకు రాలేదు. హన్మకొండ జిల్లాలోని మిల్లర్లు రకాలతో సంబంధం లేకుండా ఏ రకం ధాన్యాన్ని అయినా దిగుమతి చేసుకొనేందుకు ముందుకొచ్చారు. దాంతో ఇప్పటివరకు ఖమ్మం జిల్లాలో ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహరించిన మిల్లర్లు తమ డిమాండ్ల నుంచి వెనక్కు తగ్గాల్సిన పరిణామాలు చోటు చేసుకున్నాయి. తాము కూడా 1638 రకం ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటామని కొంతమంది మిల్లర్లు పౌరసరఫరాలశాఖ అధికారుల వద్ద సుముఖత వ్యక్తం చేశారు.

పౌరసరఫరాల శాఖ అధికారుల అంచనాల మేరకు కుర్నవల్లి ప్రాంతంలో 50వేల బస్తాలు, మిట్టపల్లి ప్రాంతంలో 25వేల బస్తాలు, రంగంబంజర్‌లో 25వేల బస్తాలు, నారయ్యబంజర్‌లో 15 వేల బస్తాలు, బిల్లుపాడులో 40వేల బస్తాలు, పినపాకలో పదివేల బస్తాలు, వైరా ప్రాంతంలో దాదాపు 50నుంచి 60వేల బస్తాలు కేఎన్ఎం 1638రకం ధాన్యం దిగుబడులు రానున్నాయి. ఒక దశలో మిల్లర్లు దిగుమతి చేసుకోవడానికి నిరాకరించడంతో ఈ సన్నరకం ధాన్యాన్ని గోదాముల్లో నిల్వ చేసి ఆ తర్వాత ఇతర ప్రాంతాల్లోని మిల్లులకు సరఫరా చేయాలని పౌరసరఫరాలశాఖ అధికారులు భావించారు. అయితే హన్మకొండ జిల్లాలోని మిల్లర్లు అన్నిరకాల ధాన్యాన్ని దిగుమతి చేసుకొనేందుకు సంసిద్ధత వ్యక్తం చేయటంతో నిన్నటివరకు ఈ రకం ధాన్యంపై విముఖత చూపిన ఖమ్మం జిల్లాలోని మిల్లర్లతోపాటు వైరా ప్రాంతంలోని మిల్లర్లు కూడా కొంత సుముఖత వ్యక్తం చేశారు.

వైరా మండలంలోని ధాన్యం తరలింపునకు హన్మకొండ జిల్లాలోని మూడు మిల్లులకు కేటాయింపు చేశారు. హన్మకొండలోని శ్రీశైలం మల్లన్న ఇండ్రస్టీస్‌కు సన్నరకం ధాన్యాన్ని, దానేపల్లిలోని శ్రీనిధి ఇండ్రస్టీస్, రాంపూర్‌లోని మారుతీ ఆగ్రో ఇండ్రస్టీకి దొడ్డు రకం ధాన్యం కేటాయింపులు చేశారు. ఇంకా నల్గొండ ఇతర జిల్లాలోని మిల్లులకు కూడా ఈ ప్రాంతంలోని ధాన్యాన్ని తరలించేందుకు కేటాయింపులు చేస్తే తమ ఇబ్బందులు తొలగిపోతాయని రైతులు చెపుతున్నారు.

పార్టీ కోసం పని చేసిన వారికే పదవులు

- ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి

సత్తుపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలు, నాయకులకు కచ్చితంగా న్యాయం జరుగుతుందని ఖమ్మం ఎంపీ ఆర్.రఘురాంరెడ్డి అన్నారు. సత్తుపల్లిలోని ఎంఆర్ గార్డెన్‌లో శుక్రవారం జరిగిన నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను కూడా గతంలో పలు సందర్భాల్లో అసెంబ్లీ స్థానానికి పోటీ చేయాలని భావించానని, కాని అప్పట్లో అవకాశం దొరకలేదని అయినా పార్టీని నమ్ముకొని పని చేశానని అన్నారు. ఈ క్రమంలోనే గత ఎన్నికల్లో తనకు పార్లమెంట్ అభ్యర్థిత్వం పార్టీ అధినాయకత్వం ఖరారు చేసిందన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు తీరుస్తూ, తప్పులను సరి చేస్తూ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనసాగిస్తున్నారని చెప్పారు. రుణమాఫీ, రైతు భరోసా, సన్నవడ్లకు బోనస్, పేదకు సన్న బియ్యం సరఫరా, మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, 200 యూనిట్ల లోపు గృహ విద్యుత్‌కు జీరో బిల్లు, రూ.500లకే వంట గ్యాస్ సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ధరణీ స్థానంలో భూ భారతి అమలు, గ్రూప్-1 పరీక్షల నిర్వహణ తదితర కార్యక్రమాలు ఎన్నో అమలవుతున్నాయని చెప్పారు. వీటన్నింటిని కార్యకర్తలు, నాయకులు గ్రామాల్లో ప్రజలకు వివరించటం లేదన్నారు. కాంగ్రెస్ బ్లాక్, మండల, గ్రామ స్థాయిల్లో కమిటీలు జరగనున్నాయని చెప్పారు.

కష్టపడిన వారికే పదవులు

కాంగ్రెస్ పార్టీ సంస్థాగత కమిటీలను ఏర్పాటు చేసే కార్యక్రమం ప్రారంభమైందని, ముందుగా జిల్లాస్థాయి పార్టీ సమావేశం నిర్వహించామని, అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు పూర్తి చేస్తామని కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలాల స్థాయిలో సమావేశంలో పూర్తి అయిన తరువాత మండల, గ్రామస్థాయిలోనూ, మునిసిపాలిటీల్లోనూ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు.

కార్యకర్తలు నిరాశ పడొద్దు

కార్యకర్తలు నిరాశ పడాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ అధిష్టానం పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తిస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ముఖ్యమంత్రి ప్రత్యేక కృషితో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయని అన్నారు. మహిళలను కోటీశ్వరులను చేసే కార్యక్రమం అమలవుతోందని చెప్పారు. ప్రతి ఒక్క ఇంటికీ ఏదో రూపంలో ప్రభుత్వ పరంగా లబ్ధి జరిగిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గత 16 నెలల కాలంలో చేసిన అభివృద్ధిని కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు, హామీ ఇవ్వని ఎన్నో కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. చేసిన పనులు చెప్పుకోవటంలో విఫలమైతే ఇబ్బందులు ఎదురవుతాయన్నారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, పరిశీలకులు బత్తిని శ్రీనివాసరావు, అనిల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

అర్ధరాత్రి వర్ష బీభత్సం

(5వ పేజీ తరువాయి)

పరిస్థితి ఏర్పడింది.. మరోవంక తీవ్ర గాలి దుమారం కారణంగా మరింత కష్ట నష్టాలు ఎదురయ్యాయి.. గాలికి రేకులు ఎగిరి పోవటం, గడ్డి వాములు చెల్లా చెదరవ్వటంతోపాటు కళ్లాల్లో ఆరబోసిన వడ్లుసైతం కొట్టుకు పోయాయి. అనేక చోట్ల చెట్లు విరిగి పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చెట్లు రోడ్లకు అడ్డంగా పడటంతో ట్రాఫిక్ అంతరాయాలు కలిగాయి. ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగి పోవటం, తీగెలు తెగి పోవటంతో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు పలు చోట్ల కరెంటు సరఫరా నిలిచి పోయింది. కరెంటును పునరుద్ధరించేందుకు విద్యుత్ సిబ్బంది స్పందించటంతో శుక్రవారం సాయంత్రానికి పరిస్థితి యథావిధిగా మారింది.

ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు

షోకాజ్ నోటీస్

ఖమ్మం కలెక్టరేట్, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్‌కు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ షోకాజ్ నోటీసును జారీ చేశారు. గత మంగళవారం జిల్లా ఆస్పత్రి పర్యటనకు వచ్చిన అదనపు కలెక్టర్ శ్రీజ ఆస్పత్రిలో పలు విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ప్రస్తుతం అమృత్ ఫార్మసీ(జనసంజీవిని) జెనిరిక్ మెడికల్ షాపును తనిఖీ చేశారు. దీన్ని కేంద్రప్రభుత్వం 2018లో ప్రారంభించింది. పదేళ్ల కాల పరిమితి దీనికి అనుమతి ఉండగానే ఆస్పత్రి ఆవరణంలో గౌతమి జిల్లా మహిళా సమాఖ్యకు జనిరిక్ మందులను విక్రయించేందుకు అనుమతిని ఇస్తూ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆమె దృష్టికి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా అమృత్ మందుల దుకాణం ఉండగా జనిరిక్ మందుల షాపుకు అనుమతిని ఇవ్వడం పట్ల ఆమె తప్పుపట్టారు. ఈనేపథ్యంలో ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలపాలని నోటీసును శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ జారీ చేశారు. మూడు రోజుల్లో దీనిపై రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలంటూ ఆ నోటీసులో పేర్కొన్నారు.

విపత్తు నష్ట నివారణకు సిద్ధంగా ఉండాలి

- ముందస్తు కార్యాచరణ ప్రణాళిక చేయాలి
- విపత్తుల నిర్వహణపై కలెక్టర్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, మే 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎలాంటి విపత్తులతో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికా చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి, విపత్తు నిర్వహణపై రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీ రాజ్, మునిసిపల్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. రాబోయే వర్షాకాలంలో భారీ వర్షాలు, వరదల పట్ల ముందస్తు సన్నద్ధతపై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విపత్తుల పట్ల ముందస్తు ఏర్పాట్లతో అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రజలకు కష్టం కలగకుండా అప్రమత్తం చేయాలన్నారు. వర్షాలు వచ్చినపుడు ముంపు ప్రాంతాలు, ప్రమాదకర నీటి వనరుల పట్ల ముందస్తుగా మ్యాపింగ్ చేసుకొని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల,మునిసిపాలిటీ స్థాయిలో ఎక్కడ ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయో గుర్తించి, వాటిని సరిదిద్దాలన్నారు. ఆపద మిత్ర క్రింద యువతి, యువకులను గుర్తించి విపత్తు నిర్వహణపై శిక్షణ ఇచ్చినట్లు, జిల్లాలో



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పక్కన సీపీ సునీల్‌దత్

గ్రామీణ ప్రాంతాల్లో 139, పట్టణ ప్రాంతాల్లో 161 మంది యువతను 'ఆపద మిత్ర' క్రింద ఎంపిక చేసి 10 రోజుల క్లాస్ రూమ్ శిక్షణ, క్షేత్ర శిక్షణ ఇచ్చి, వైద్య పరీక్షలు చేపట్టి వారికి ఫిట్ నెస్ పరీక్షలు చేసి, జీవిత బీమా చేయించినట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి అధికారులు, ఆపదమిత్ర, ఫిషర్ మెన్, ఈతగాళ్లతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేసి సమాచారం అందిపుచ్చుకొనేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కేంద్రాల్లో 1077 నెంబరుతో కంట్రోల్ రూమ్ పనిచేస్తుందన్నారు. మండల కేంద్రాల్లో ల్యాండ్‌లైన్ ఫోన్లను క్రియాశీలం చేసి, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. సీపీ సునీల్ దత్ మాట్లాడుతూ, గత అనుభవం దృష్ట్యా ఏం చేయాలనే ఆలోచించాలన్నారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ డీఆర్‌ఎఫ్ టీములను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. గత వరదల్లా నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, జడ్పీ సీఈవో దీక్షారైనా, డీఆర్డీవో సన్యాసయ్య, అధికారులు పాల్గొన్నారు.

'దోస్త్' నోటిఫికేషన్ విడుదల

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 2(ఆంధ్రజ్యోతి): డిగ్రీ ప్రవేశాలకు ఉన్నత విద్యా మండలి శుక్రవారం దోస్త్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మూడు విడతల్లో ప్రవేశాలకు అవకాశం కల్పించింది. మొదటి విడత మే 3 నుంచి 21వ తేదీ వరకు మొదటి విడత దరఖాస్తుల స్వీకరణ, మే 10 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్లు, మే 29న మొదటి విడత సీట్ల కేటాయింపు. రెండో విడత మే 30 నుంచి జూన్ 8 వరకు దరఖాస్తుల స్వీకరణ, మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్లు, జూన్ 13న సీట్ల కేటాయింపు. మూడో విడతలో జూన్ 13 నుంచి 19 వరకు దరఖాస్తుల స్వీకరణ, జూన్ 13 నుంచి 19 వరకు వెబ్ ఆప్షన్లు, జూన్ 23న సీట్ల కేటాయింపు. జూన్ 30 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు.

ధూప, దీప నైవేద్యానికి దరఖాస్తులు

ఖమ్మం ఖానాపురంహవేలి, మే2(ఆంధ్రజ్యోతి): ధూప, దీప నైవేద్యం పథకానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అర్హత కలిగిన ఆలయాల నుంచి దరఖాస్తులు చేసుకోవాలని దేవాదాయ శాఖ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ దరఖాస్తులను మే 24 లోగా దేవాదాయ శాఖ కార్యాలయంలో అందించాలని తెలిపారు. ఈ పథకం కింద ఎన్నికైన ఆలయాలకు ధూప,దీప నైవేద్యం కింద నెలకు రూ. 4వేలు, రూ.6 వేలు అర్చకుని గౌరవ భృతికి చెల్లిస్తారు. ఆలయాలు కనీసం 15 సంవత్సరాల క్రితం నిర్మించబడి ఉండి, నిత్య పూజలు చేస్తూ ఆలయానికి భక్తులు సందర్శనాలు ఉండాలి. పురాతన ఆలయాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ పథకం మునిసిపల్, కార్పొరేషన్ పరిధిలోని ఆలయాలకు వర్తించదని తెలిపారు. ఈ పథకం సంవత్సరంలో ఒకసారి, లేదా రెండుసార్లు జాతర్లు జరిగే గ్రామ దేవత ఆలయాలకు వర్తించదని తెలిపారు. అర్హత కలిగిన ఆలయాలు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.



భారీ వర్షానికి ధ్వంసమైన బొప్పాయి తోటను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం

- విపత్తులను ఎదుర్కొనే అయిల్ పామ్ పంటలు సాగు బాగు
- పంట మార్పిడితో అకాల వర్షాల నష్టాలను తగ్గించవచ్చు
- అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 2(ఆంధ్రజ్యోతి): పంట మార్పిడి విధానంతో అకాల వర్షాల నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని, పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం అన్నివేళలా ఆదుకుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. అకాల వర్షంతో దెబ్బతిన బొప్పాయి ఇతర పంటలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. బాధిత రైతులతో నేరుగా మాట్లాడి వారి గోడును తెలుసుకున్నారు. శుక్రవారం సాయంత్రం రఘునాథపాలెం మండలంలోని సూర్యతండాలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. గిరిజన రైతుల బొప్పాయి సాగు క్షేత్రాలకు వెళ్లి అకాల వర్షంతో నష్టపోయిన తీరును స్వయంగా పరిశీలించారు. ఖమ్మం నగరానికి రఘునాథపాలెం మండలం సమీపంలో ఉండటంతో జిల్లా కేంద్రానికి కావాల్సిన ఉద్యాన పంటలను ఇక్కడ నుంచే సాగు జరుగుతుందని ఆ మేరకు బొప్పాయి, కూరగాయలు ఇతర పంటలను సాగు చేయటం జరిగిందని గిరిజన రైతులు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు 25వేల ఏకరాలకు పైగా నష్టం వాటిల్లిందని నివేదికలు అందాయని తెలిపారు. గత రెండు మూడు రోజులుగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలపై అన్ని జిల్లాల కలెక్టర్లు ద్వారా పంట నష్టం అంచనాలు తెప్పించటం జరిగిందన్నారు. తత్కాలికంగా రైతులకు ఆర్థికంగా సహాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ముఖ్యంగా ఏప్రిల్, మే నెలల్లో కురిసే వర్షాలకు బొప్పాయి, మొక్కజొన్న, మిర్చి పంటలు నష్టంపోతున్నారని, వర్షాలను తట్టుకునే పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. పంటలను మార్పిడి విధానాన్ని రైతులు పాటించాలన్నారు.

అయిల్‌పామ్ సాగు చేసిన రైతులు అకాల వర్షాలకు నష్టపోవటం లేదన్నారు. రైతులందరూ నూతన వ్యవసాయ విధానాలను ఆలోచిస్తూ నూతన వ్యవసాయ పంటలు సాగు చేయాలని, తక్కువ శ్రమ, దీర్ఘకాలిక లాభాలు వచ్చే అయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలన్నారు. ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, మండల కాంగ్రెస్ కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్ పాల్గొన్నారు.



జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల భవనం

మూడేళ్లయినా మోక్షమెన్నడో?

- పూర్తికాని టెండర్ల ప్రక్రియ
- 2024లో రూ.100కోట్లు మంజూరు
- సౌకర్యాలు లేక ,అడ్మిషన్లు రద్దు చేసుకుంటున్న విద్యార్థులు
- అరకొర వసతులతో తగ్గిన అడ్మిషన్ల సంఖ్య
- పాలేరు జేఎన్‌టీయూ(హెచ్) కళాశాల పరిస్థితి

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గం పరిధిలో మద్దులపల్లిలో గల జేఎన్‌టీయూ(హెచ్) ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణ పనులకు మోక్షం లభించడం లేదు. మూడేళ్లుగా నిర్మాణ మంజూరు ఫైల్స్ మూలుగుతూనే ఉన్నాయి. 2024 నవంబరు 21న రూ.108.60 కోట్లు భవన కోసం మంజూరయ్యాయి. జేఎన్‌టీయూ కళాశాల 2023-24 విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి వచ్చింది. కళాశాల ప్రారంభం రోజు ఏడాదిలో నూతర భవనాన్ని ప్రారంభించుకుందామని వాగ్దానం చేసిన పలువురు అధికారులు, నాయకులు ఆ మాటే మరిచారు. 2026-27 విద్యా సంవత్సరానికైనా భవనం అందుబాటులోకి వస్తుందో రాదో అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అరకొర సౌకర్యాలు.. అన్నీ సమస్యలు..

కళాశాలలో విద్యార్థులకు అరకొర సౌకర్యాలతో ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. కళాశాలలో ల్యాబ్, హాస్టల్ వసతిలో ఇబ్బందులు తీవ్రంగానే ఉన్నాయి. 2023-24, 2024-25 ఏడాదిలో భారీగానే అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు ఆ తరువాత కళాశాలకు చేరుకొని వసతుల పూర్తిస్థాయిలో లేకపోవటంతో కొందరు విద్యార్థులు సీట్ రద్దు చేసుకున్నారు. కళాశాలకు శాశ్వత భవన నిర్మాణ పనుల్లో కదలిక లేకపోవటంతో విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. అరకొర సౌకర్యాల మధ్యే ఇంజనీరింగ్ విద్యనభ్యసించాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.300 కోట్ల అంచనాతో కళాశాల భవనం నిర్మించాల్సి ఉండగా.. ఇప్పటికే తొలి విడతగా రూ.100 కోట్ల పనులపై అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరైనా, ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకుండకపోవటంతో నిర్మాణ పనులు మొదలు కాలేదు.

నిర్మాణం పూర్తైతేనే ప్రవేశాలు పెరిగేది..

మొదటి విడతలో రూ. 108.60 కోట్లతో కళాశాల భవనాలకు శంకుస్థాపన చేసి భవన నిర్మాణాలు చేపడితే వచ్చే ఏడాది అడ్మిషన్లు అధికంగా ఉంటాయని పలువురు విద్యార్థుల తల్లితండ్రులు అంటున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేకపోవటంతోనే అడ్మిషన్ల సంఖ్య తక్కువగా ఉంది. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో అడ్మిషన్లు రావటంమంటే గొప్పగా చెప్పుకొంటారు. మెరిట్ విద్యార్థులకు మాత్రమే వచ్చే అడ్మిషన్లు వసతులు లేకపోవటంతో మెరిట్ విద్యార్థుల తోపాటు ఇతర విద్యార్థులు వచ్చిన సీటును రద్దు చేసుకుంటున్నరంటే, ప్రభుత్వం ఆలోచించి, విడుదలైన నిధులతో భవన నిర్మాణ పనులు మొదటు పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వచ్చే ఏడాది సొంత భవనాలు

రమేశ్, ప్రిన్సిపాల్, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల

జేఎన్‌టీయూ మద్దులపల్లి కళాశాలకు 2026-27 విద్యా సంవత్సరంలో నూతన భవనాలు ఏర్పాటు కానున్నాయని ఆశిస్తున్నాం. జిల్లాలోని ముగ్గురు మంత్రుల, అధికారుల సహకారంతో త్వరలోనే సొంత భవనాల నిర్మాణాలు ప్రారంభంకానున్నాయి. సొంత భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు అద్దె భవనంలోనే జేఎన్టీయూ కళాశాల తరగతులు నిర్వహిస్తాం. వైటీసీలో కొనసాగుతున్న కళాశాలను జేఎన్టీయూ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్లు పరిశీలించి శాశ్వత భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని సందర్శించారు. కళాశాలకు ఉన్న సమస్యలను వివరించాం. గత మార్చిలో టెండర్ నోటిఫికేషన్ వచ్చింది. గత వారంలో నూతన భవన నిర్మాణ ప్రాంతం స్థలంలో సర్వే నిర్వహించారు. త్వరలోనే భవన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి.

వడదెబ్బతో ఇద్దరి మృతి

ఖమ్మం రూరల్/ పెనుబల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో వడదెబ్బతో శుక్రవారం ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఖమ్మం రూరల్ పరిధిలోని ఆరెంపుల గ్రామంలో దోరెపల్లి శ్రీను(55) అనే వ్యక్తి కూలిపనులు చేస్తుంటాడు. తీవ్రంగా పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా శ్రీను మధ్యాహ్నం సమయంలో అస్వస్థకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఖమ్మం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెనుబల్లి మండలం రామచంద్రరావుబంజర్ గ్రామానికి చెందిన మరకాల శ్రీనివాసరావు(40)గురువారం వడదెబ్బకు గురయ్యాడు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు వీఎం బంజర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పెనుబల్లి ఆసుపత్రిలో శ్రీనివాసరావు మృతదేహానికి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు.

కార్మికుల ఐక్యతకు, శక్తికి ప్రతీక మేడే

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి

నేలకొండపల్లి ,మే2(ఆంధ్రజ్యోతి): కార్మికవర్గ అస్థిత్వానికి, పని దినాల తగ్గింపునకు సాగిన వీరోచిత పోరాటమే మేడే అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి భానుప్రసాద్ అన్నారు. మేడేను పురస్కరించుకుని శుక్రవారం కర్నాటిభవన్ వద్ద జరిగిన కార్యక్రమంలో భానుప్రసాద్ అరుణపతాకాన్ని ఎగురవేసారు. దేశంలో కార్మికవర్గం చేసిన పోరాటాలు, త్యాగాల ఫలితంగా ఎన్నో కార్మిక చట్టాలు చేయబడ్డాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక చర్యలకు నిరసనగా కార్మికవర్గం మరో పోరాటానికి సిద్ధం కావాలని భానుప్రసాద్ పిలుపునిచ్చారు. మరో కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్.ఖాజామియా మేడే జెండాను ఎగురవేసారు. మేడే స్పూర్తితో కార్మికవర్గం కార్మికుల హక్కులను కాపాడుకోవటానికి పోరాటాలు చేయాలని ఖాజామియా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షాల్తియా శ్రీనివాసరావు, పాలపాటి అశోక్, చావా గణపతిరావు, కాశిబోయిన అయోధ్య, రాయల మాధవరావు, మారిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మేడే జెండాను ఎగురవేస్తున్న కర్నాటి భానుప్రసాద్

గుండెపోటుతో ఫొటోగ్రాఫర్ భరత్ మృతి



మణుగూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): పీవీ కాలనీకి చెందిన ఫొటో గ్రాఫర్ కొర్ర భరత్ కుమార్(54) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. కాలనీలో ఫొటో, కంప్యూటర్ సెంటర్ నిర్వహిస్తూ జీవించేవారు. స్థానికంగా ఉన్న ఆలయాలల్లో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ఆలయాల అభివృద్ధిలో తన వంతు సహకారం అందించారు. రెండు రోజుల క్రితం ఆరోగ్యం సరిగా లేదని, శుక్రవారం డాక్టర్‌ను సంప్రదించాలనుకుంటుండగా చాతి ఒప్పి వచ్చింది. భద్రాచలం ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలోనే మృతి చెందారు. కార్మికసంఘాల నాయకులు ఏరియా అధికారులు కార్మిక కుటుంబాలు భరత్ మృతి పట్ల సంతాపం వ్యక్తంచేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి..

కామేపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): బైక్‌ను ట్రాలీ ఢీకొనగా ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కామేపల్లి మండలం కొత్తలింగాల సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు బాసిత్‌నగర్ గ్రామానికి చెందిన అద్దంకి కోటేష్(27) తన బైక్‌పై కొత్తలింగాల వస్తున్నాడు. ఓ ట్రాలీ ఆటో కొత్తలింగాల కోటమైసమ్మ ఆలయ సమీపంలో బైక్‌ను ఢీకొట్టడంతో బైక్ మీద నుంచి కొంత దూరంలో ఉన్న గోతిలో పడ్డాడు తలకు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి ఉప్పలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికుమార్ తెలిపారు.

ఏఆర్ హెడ్‌క్వార్టర్‌కు హోంగార్డు అటాచ్

వైరా, మే 2 (ఆంధ్రజ్యోతి): వైరా మండల పరిధిలోని దాచాపురం-గన్నవరం గ్రామాల మధ్య అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తూ అక్రమ వసూళ్లను ప్రోత్సహించిన హోంగార్డు రామకృష్ణను ఏఆర్ హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేశారు. అంతర్రాష్ట చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న హోంగార్డు రామకృష్ణ నలుగురు ప్రైవేట్ వ్యక్తులను నియమించుకొని వాహనదారుల నుంచి అక్రమ వసూళ్లకు ప్రోత్సహించారనే కారణంపై ఏఆర్ హెడ్‌క్వార్టర్‌కు శుక్రవారం అటాచ్ చేశారు. గురువారం సాయంత్రం ఈ అక్రమ వసూళ్ల వ్యవహారంపై వాహనదారులు నిలదీసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నలుగురు ప్రైవేట్ వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వరిగడ్డి వాము దగ్ధం

తల్లాడ, మే2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలగవరం గ్రామంలో శుక్రవారం విద్యుత్ షార్టుసర్క్యూట్‌తో వరిగడ్డి వాము దగ్ధమైంది. గ్రామంలో విద్యుత్ సర్వీసువైరు తెగి షార్టుసర్క్యూట్‌కావడంతో భూక్యా నాగుకు చెందిన 5 ఎకరాల వరిగడ్డి వాడు దగ్ధమైంది. ప్రమాద సమాచారం అందుకున్న వైరా అగ్నిమాపకకేంద్రం నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది. దీంతో రూ.50వేల నష్టం జరిగింది.

పోలీసుల అదుపులో కాపర్ దొంగలు

- గోప్యంగా ఉంచిన పోలీసులు

కారేపల్లి, మే2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంసమీపంలోని సింగరేణి సంస్థకు చెందిన సోలార్‌ప్లాట్‌లో బుధవారం రాత్రి పెద్దమొత్తంలో కాపర్ వైరు చోరీకిగురైంది. చోరికి పాల్పడినవారు కారులో ఖమ్మంవైపునకు తరలిస్తుండగా కారేపల్లి పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. పట్టుకున్న దొంగలు వాడిన వాహనం ప్రస్తుతం పోలీసుస్టేషన్‌లో ఉంది. అయితే గురువారం ఈవిషయం బయటకురావడంతో, చోరీకి సంబంధించిన విషయంపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. చోరీకి గురైనా కాఫర్‌వైరు విలువ రూ.ఐదులక్షలకు పైగా ఉంటుందని సమాచారం.



పట్టుబడిన కాపర్ తీగ

రామానుజాచార్యులకు ప్రత్యేక అభిషేకం, అర్చన

- ఆదిశంకరాచార్యుల వారికి పాదుకాపూజ, అన్నాభిషేకం

భద్రాచలం, మే 2 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ భగవద్రామానుజుల వారి తిరునక్షత్రాన్ని పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. సాయంత్రం దర్బారు సేవలో రామానుజల వారికి విశేష అర్చన, అలాగేచుట్టు సేవ నిర్వహించారు. అలాగే శ్రీ భగవద్రామానుజ సేవా సమితి, వికాస తరంగిణి ఆధ్వర్యంలో అగ్నిమాపక కేంద్రం సమీపంలో ఉన్న రామానుజల విగ్రహంకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం స్థానాచార్యులు కేశఈ స్థలశాయి, విశ్రాంత ప్రధాన అర్చకులు పొడిచేటి రామచంద్రాచార్యులు, విశ్రాంత ముఖ్య అర్చకులు అమరవాది సీతారామానుజాచార్యులు, గట్టు వెంకటాచార్య, ఎన్‌సీహెచ్ చక్రవర్తి, డాక్టర్ సుదర్శన్‌రావు, డాక్టర్ జయభారతి, కమలా రాజశేఖర్, అల్లం నాగేశ్వరరావు, ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆదిశంకరాచార్యుల వారి జయంతిని పురస్కరించుకొని భద్రాచలంలోని అంబాసత్రంలో ఆదిశంకరాచార్యుల వారి పాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమయంలో పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామార్చన నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రసాద నివేదన చేశారు. అంబాసత్రం మేనేజరు మూర్తి, అర్చకులు యామజాల శశికాంత్ శర్మ, కొవ్వూరి శివరామకృష్ణ శర్మ పాల్గొన్నారు. సాధువుల మండపంలో అన్నాభిషేకాన్ని నిర్వహించారు. గౌతమీ బ్రాహ్మణ పురోహిత సంఘం ఆధ్వర్యంలో ఆదిశంకరాచార్య స్వామి వారి జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో రవికుమార్ శర్మ, పవనకుమార్ శర్మ, ఎంవి శ్రీనివాస్, రామకృష్ణ శాస్త్రి పాల్గొన్నారు.



రామానుజల విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

విద్యుదాఘాతంతో గేదెల మృత్యువాత

ముదిగొండ/ కారేపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో తొమ్మిది గేదెలు మృత్యువాత పడ్డాయి. విద్యుదాఘాతంతో నాలుగు పాడిగేదెలు మృత్యువాత పడిన సంఘటన ముదిగొండ మండలం ధనియాలగూడెం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గురువారం అర్ధరాత్రి వీచిన ఈదురుగాలు, ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో పొలాల్లోని విద్యుత్ తీగెలు కిందపడిపోయాయి. ధనియాలగూడెం గ్రామంలోని చెరుకుపల్లి వీరబాబు, చెరుకుపల్లి వెంకట్రావమ్మ, సంద్ర మైసమ్మ, చెరుకుపల్లి సైదమ్మలకు చెందిన పాడిగేదెలు శుక్రవారం మేత కోసం వెళ్లగా ఆవిద్యుత్ తీగెలు తగలడంతో విద్యుదాఘాతానికి మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. సంఘటనాస్థలాన్ని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ వివరాలు సేకరించారు.

కారేపల్లి మండల పరిధిలోని బొక్కలతండాలో శక్రవారం మేతకోసం వెళ్లిన హాథిరాం అనే రైతులకు చెందిన ఐదు గేదెలు విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాయి. బుధవారం రాత్రి వీచిన గాలిదుమారంతో తండాకు సమీపంలో విద్యుత్‌వైర్లు తెగిపడ్డాయి. ఇదే విషయాన్ని ఈప్రాంతరైతులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. కిందపడిపోయిన విద్యుత్‌వైర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేసిన్నట్లు తెలిపారని, దీంతో గేదెలను మేతకోసం ఈప్రాంతానికి తరలించిన్నట్లు తెలిపారు. అయితే కిందపడిన వైర్లకు విద్యుత్ సరఫరా కావడంతో ఐదు గేదెలు విద్యుదాతంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి.

పరిహారం చెల్లించాలని ఆందోళన

విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతోనే గేదెలు మృతిచెందాయని, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌చేస్తు తండాకు చెందిన పలువురు యువకులు సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. పరిహారం వచ్చేలా చూస్తామని విద్యుత్ ఏఈ సుధాకర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అత్తపై దాడికి పాల్పడిన కోడలు, కొడుకు అరెస్ట్

అశ్వాపురం, మే2(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని గొందిగూడెం గ్రామంలో అత్త ఈశ్వరమ్మ, ఆమె సోదరి ఊర్మిళపై నిప్పుకట్టె, వేడినీళ్లతో దాడిచేసిన కోడలు వాసం నవీనా, కొడుకు సతీష్‌లను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు అశ్వాపురం సీఐ అశోకొరెడ్డి తెలిపారు. ఈదాడిలో తీవ్రంగా గాయపడిన ఊర్మిళ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నదని, ఇరువురు నిందితులను మణుగూరు మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు వారు తెలిపారు.

ఎవరైనా తల్లిదండ్రులనుగాని, ఇతరపెద్దలపై దాడిచేసినా, వేధించినా కఠినచర్యలు తప్పవని సీఐ తెలిపారు.



16న నగర పాలక సంస్థ కార్యాలయం ముట్టడి

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 2(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో నిరుపేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16న ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం ముట్టడి చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం సుందరయ్య భవన్‌లో వజినేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఖమ్మం డివిజన్ కమిటీ సమావేశంలో ఖమ్మం నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఇప్పటి వరకు పార్టీ చేపట్టిన ఉద్యమాలను సమీక్షించారు. డివిజన్ కార్యదర్శి విక్రమ్, నాయకులు నవీన్‌రెడ్డి, మీరా సాహెబ్, తిరుపతిరావు, భూక్యా శ్రీనివాస్, సుదర్శన్, నాగసులోచన, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

అకాల బీభత్సం

- విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరా నిలిచి ప్రజల అవస్థలు
- పంటలు నష్టపోతున్న అన్నదాతలు
- కొనుగోలు కేంద్రాల్లోనే తడిసి ముద్దవుతున్న ధాన్యం
- నేలరాలిన మామిడి.. రైతు కంట కన్నీరు

ఖమ్మం సాంస్కృతికం, మే 2 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం, గాలి దుమారం ఖమ్మం నగరంలో బీభత్స వాతావరణాన్ని కలిగించింది. బుర్హాన్‌పురం, మామిళ్లగూడెం, ఎన్నెస్పీ క్యాంపు తదితర ప్రాంతాల్లో గాలి దుమారం తీవ్ర ప్రభావాన్ని చూపింది. బుర్హాన్‌పురంలో చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయంతోపాటు కార్ పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన రేకుల షెడ్ ధ్వంసం అయింది. మరోవంక ఇళ్లకు కప్పులుగా వేసిన రేకులు ఎగిరి పోయాయి. విద్యుత్ స్తంభాలు వరుసగా ఒరిగి పోవటంతో కరెంటు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు రాత్రంతా నిద్ర లేకుండా జాగారం చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఒరిగి పోయిన కరెంటు స్తంభాలకు శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రవరకు మరమ్మత్తులు జరిపారు. కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు.

మళ్లీ ముంచిన వర్షం

కూసుమంచి: ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన పంటలను అకాల వర్షం మళ్లీ ముంచింది. వారం రోజుల వ్యవధిలో పలుమార్లు పడిన వర్షం కారణంగా పంటలు దెబ్బతిని పుట్టెడు కష్టాల్లో ఉంటే గురువారం అర్ధరాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షం దెబ్బమీద దెబ్బ కొట్టింది. తీరా అమ్ముకునే సమయంలో కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిచి ముద్దయింది. మామిడి నేలరాలింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రెండు మూడు రోజులకోసారి వానలు పడుతుండటంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈదురుగాలతో కురుస్తుండటంతో వరికుప్పలపై కప్పిన పట్టాలు గాలికి ఎగిరి పోతున్నాయి. దీంతో రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కోసిన పంటలు కాపాడుకోలేక శాంతించు వానదేవుడా అంటూ దేవుని ప్రార్థిస్తున్నారు. నెలరోజులుగా ఈ ప్రాంతంలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించారు. అయితే రైతులు వెంటనే కొనుగోళ్లు చేయకపోవడంతో పంట అంతా కేంద్రాల్లోనే మూలుగుతోంది. బస్తాలు లేవని, లారీలు రావడం లేదని, తేమశాతం, కూలీలు రావడం లేదంటూ అనేక కొర్రీలు పెడుతుండటంతో సగానికి పైగా ధాన్యం కేంద్రాల్లోనే ఉంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తరలించాల్సిన ఆయాశాఖల అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. నెపాన్ని ఒకరిపై ఒకరు నెడుతున్నారు. బస్తాల కొరత, లారీల కొరత, కూలీల కొరత అంటూ రైతులను ఇబ్బందులు పెడుతుండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడురోజులక్రితం చేగొమ్మ కేంద్రం రైతులు గంటపాటు రాస్తారోకో చేస్తే.. అదేరోజు మూడులారీల్లో ధాన్యాన్ని తరలిస్తామని చెప్పి ఒక్కలారీ పంపించారని అది కూడా కేంద్రంలోని ధాన్యాన్ని కాకుండా, కళ్లాల్లో ఉన్న ఓ పార్టీ నాయకుడి ధాన్యాన్ని మాత్రమే తరలించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం రైతుసంఘం నాయకులు కూసుమంచిలో మంత్రి పొంగులేటిని కలిసి విన్నవించిన వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు ఆదేశించారు. అయినా ఎటువంటి స్పందన కనిపించకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేలరాలిన మామిడి

భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కారణంగా మామిడి కాయలు నేలరాలడంతో రైతులకు తీవ్రనష్టం వచ్చింది. ఈ ఏడాది కాపు ఆలస్యంగా వచ్చింది. దీంతో కాయ పాకానికి వచ్చేవరకు ఆగడంతో అకాలవర్షం ఈదురుగాలులకు కాయలు భారీగా నేలరాలాయి. కూసుమంచి, గట్టుసింగారం, పెరికశింగారం, అగ్రహారం, మునిగేపల్లి, పోచారం గ్రామాల్లో మామిడి నేలరాలింది.

లారీలను పంపిస్తున్నాం: తహసీల్దార్

ధాన్యం ఎగుమతులకు లారీలను పంపిస్తున్నామని కూసుమంచి తహసీల్దార్ కరుణశ్రీ తెలిపారు. కాంటాలు వేసిన ధాన్యం మిల్లులకు తరలించే చర్యలు చేపడుతున్నామన్నారు. రైతులు అధైర్యపడొద్దని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, మళ్లీ వర్షసూచన ఉన్నందున రైతులు జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

మండలంలోని కిష్టాపురం, నేలపట్ల, చేగొమ్మ కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ అధికారి వాణి పరిశీలించారు. గురువారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి ఆరబోసిన ధాన్యం తడిసిందని తెలిపారు. ధాన్యం మొలక్తెత్తకుండా తడిసిన ధాన్యంపైన లీటర్ నీటికి సుమారు 50 గ్రాములు ఉప్పు కలిపిన ద్రావణాన్ని చల్లుకుని పలుచగా ఆరబోసుకోవాలని సూచించారు. రైతులు అధైర్యపడొద్దని అన్నారు. ఆమె వెంట ఏఈవోలు రవి కుమార్, ప్రియాంక, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బోరుమంటున్న రైతులు..

నేలకొండపల్లి: శుక్రవారం తెల్లవారుఝామున ఉరుములు, మెరుపులతో కురిసిన అకాల వర్షం రైతును నిలువునా ముంచేసింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవటానికి రైతులు తెచ్చిన ధాన్యం అకాల వర్షానికి తీవ్రంగా నష్టపోయారు. ధాన్యాన్ని దళారులకు తెగనమ్ముకోలేక, మద్దతు ధరకు అమ్ముకోవటానికి కొనుగోలు కేంద్రాలకు తెచ్చి కొనే నాథుడు లేక నానా అవస్థలు పడుతున్నారు. వీటికి తోడు అకాల వర్షాలు రైతుల నెత్తిన పిడుగులా పడుతూ ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఒక్క నేలకొండపల్లి మార్కెట్‌లోని డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రంలోనే వేల కొద్దీ క్వింటాళ్ల ధాన్యం కొనుగోలుకు ఎదురు చూస్తున్నది. మండల పరిధిలోని మూటాపురం గ్రామంలో రోడ్లపై ఆరబోసిన బెల్లం శ్రీనివాసరావు(వాసు)కు చెందిన ధాన్యం, మొక్కజొన్న పూర్తిగా తడిసిపోయింది. పెద్ద మొత్తంలో ధాన్యం, మొక్కజొన్న తడిసిపోవటంతో వాసు తీవ్రంగా నష్టపోయాడు. మండలంలోని వివిధ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సైతం పెద్ద మొత్తంలో ధాన్యం తడిసినట్లు తెలుస్తున్నది. అకాల వర్షంతో ధాన్యం తడవడంతో రైతులు బోరున విలపిస్తున్నారు. తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



ఖమ్మం బుర్హాన్‌పురంలో ఒరిగిన స్తంభాలు

నేలరాలిన మామిడి తోటలు

గాలి దుమారానికి లేచిపోయిన ఇళ్లపై రేకులు

ఖమ్మం రూరల్: మండలంలో గురువారం అర్ధరాత్రి వీచిన గాలి దుమారం బీభత్సం సృష్టించింది. ప్రధానంగా మండలంలోని మంగళగూడెం, కాచిరాజుగూడెం, గోళ్లపాడు, తీర్దాల, గుదిమళ్ల, తెల్దారుపల్లి, తల్లంపాడు తదితర గ్రామాల్లో ఈదురు గాలి విపరీతంగా వీచింది. ఈ గాలి దుమారానికి మామిడితోటల్లో మామిడి కాయ పూర్తిగా రాలిపోయాయి. దీంతో మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మంగళగూడెం, వివిధ గ్రామాల్లో గాలి దుమారానికి ఇండ్లపై ఉన్న రేకులు పూర్తిగా లేచిపోయి ఇళ్లు ధ్వంసం అయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాచిరాజుగూడెం గ్రామంలోని జువ్వాజి భగీరథ్ అనే రైతుకు చెందిన 15 ఎకరాల మామిడి తోటలో మామిడి కాయలు పూర్తిగా రాలిపోయాయి. సుమారు రూ. 2 లక్షల పంటనష్టం జరిగిందని రైతు వాపోయారు. తీవ్రంగా నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అకాల వర్షం తమకు శాపంగా మారిందని రైతులు వాపోతున్నారు. అకాల వర్షంతో మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడిన పంట నేలపాలైందని వాపోతున్నాడు.



నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్లో తడిసిన ధాన్యం



కూసుమంచి మండలం చేగొమ్మలో తడిసి ముద్దయిన ధాన్యం



ఖమ్మం నగరంలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

ఖమ్మం ఏఎంసీ చైర్మన్ కుటుంబ సభ్యులకు పరామర్శ



నివాళులర్పిస్తున్న నాయకులు

రఘునాథపాలెం, మే 2(ఆంధ్రజ్యోతి): ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు కుటుంబ సభ్యులను టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు పరామర్శించారు. శుక్రవారం రఘునాథపాలెం మండలంలోని వీవీపాలెంలో యరగర్ల నివాసానికి టీఎన్జీవోస్ నాయకులు చేరుకున్నారు. ఇటీవల యరగర్ల హనుమంతరావు తండ్రి పిచ్చయ్య మరణించటంతో ఆయన చిత్రపటం వద్ద టీఎన్జీవోస్ నాయకులు రాయల నర్సింహారావు, తాళ్లూరి శ్రీకాంత్, కృష్ణయ్య నివాళులర్పించారు.

టాపర్‌కు అభినందనలు

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో 592 మార్కులు సాధించి ఖమ్మం జిల్లా టాపర్‌గా నిలిచిన ముత్యాల అఖిలేష్‌ను కాంగ్రెస్ కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి శెట్టి రంగారావు అభినందించారు. శుక్రవారం ఖమ్మంలోని విద్యార్థి నివాసానికి వెళ్లిన నాయకులు విద్యార్థితో పాటుగా తల్లిదండ్రులను సన్మానించారు. పగడాల మంజుల, మదూరి పూర్ణచంద్రరావు, సముద్రాల శ్రీనివాస్, నర్సయ్య, పర్వతనేని నాగయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జీపీఎఫ్ ఖాతాలలో వడ్డీ జమ కావటంలేదు



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 2 (ఆంధ్రజ్యోతి): 2022 విద్యా సంవత్సరం నుంచి జడ్పీ జీపీఎఫ్‌లో ఉపాధ్యాయుల వడ్డీ జమ కావటంలేదని శుక్రవారం జడ్పీ సీఈవో దీక్షారైనాను పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందించారు. గత మూడు సంవత్సరాలుగా ఖాతాల నిర్వాహణ సరిగా లేకపోవటం, ఉద్యోగ విరమణ పొందిన, క్యాడర్ మారిన ఉపాధ్యాయుల జీపీఎఫ్ ఖాతాలో నిలువలను బదిలీ చేసేటప్పుడు దానికి వడ్డీ మొత్తం జమ చేయకపోవటంతో ఉద్యోగ విరమణ సమయంలో నష్టపోవాల్సి వస్తుందని అన్నారు. సీఈవో స్పందిస్తూ ఖాతా బదిలీ చేసేటప్పుడు వడ్డీ మొత్తాన్ని మాన్యువల్‌గా లెక్కించి ఆ మొత్తాన్ని స్టేట్‌మెంట్ రూపంలో ఇతర జిల్లాల జడ్పీలకు తెలియపరుచుతామని అన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కట్ట శేఖర్, చంద్రశేఖర్‌రావు, రత్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నైట్ పాఠశాలలో సరస్వతీ పూజ

పాల్గొన్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్సీ మధు



గదులను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల, ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం ఖానాపురం హవేలీ, మే 2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని కవిరాజ్ నగర్‌లోని ఇగ్నైట్ నూతన పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సరస్వతీ పూజలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ అధునాతన వసతులతో, అందిరికి అందుబాటులో ఫీజులతో, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యను అందించాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. లాభాపేక్ష చూడకుండా పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు పాటి మాధవరావు, గుర్రం శ్రీహరి, దనిశెట్టి రాజేష్, తమ్మ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా విద్యా బోధనలో అనుభవం గడించి, పాఠశాలలో నేటి విద్యా బోధనకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, 10వ డివిజన్ కార్పొరేటర్ చావా మాధురీ నారాయణరావు, 11వ డివిజన్ కార్పొరేటర్ సరిపూడి రమాదేవి సతీష్, 13వ డివిజన్ కార్పొరేటర్ ఆళ్ల నిరీషారెడ్డి, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రెయినేజ్ పనులను వేగిరం చేయాలి: కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, మే 2(ఆంధ్రజ్యోతి): భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం ఖమ్మం నగరంలో మురుగు నీటి పైప్ లైన్ భూగర్భ డ్రైనేజ్ నిర్మాణ పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో 249.5 కోట్లతో భూగర్భ డ్రైనేజ్ పనులను అమృత్ 2 పథకం క్రింద మంజూరుచేసినట్లు తెలిపారు. వీటిలో 189 కోట్ల 50 లక్షల రూపాయలు భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ నిర్మాణం, 60 కోట్ల రూపాయలు రాబోయే 10 సంవత్సరాలకు నిర్వహణకు కేటాయించినట్లు తెలిపారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణంలో డ్రైనేజ్ లైన్ 8.5 కిలోమీటర్లకు గాను 1.54 కిలోమీటర్లు, 432 మ్యాన్ హోల్స్ నిర్మాణానికి గాను 73 మ్యాన్ హోల్స్ నిర్మాణం పూర్తి చేశారన్నారు. ధంసలాపురం చెరువు వద్ద 44 ఎంఎల్‌డి సామర్థ్యంతో, పుట్టకోట చెరువు వద్ద 9.5 ఎంఎల్‌డి సామర్థ్యంతో మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ జరుగుతుందన్నారు. మురుగు నీటి కాల్వల 2.5 కిలో మీటర్ల వరకు ఏలాంటి నిర్మాణాల తొలగింపు లేకుండా పూర్తి చేయవచ్చని, 1.5 కిలో మీటర్ వరకు ప్రస్తుతం పూర్తయిందన్నారు. టౌన్ ప్లానింగ్, నీటి పారుదల శాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్ర స్థాయి పర్యటించి అవసరమైన పరీక్షలు పూర్తి చేసి, మురుగు నీటి కాల్వల నిర్మాణం అడ్డుగా ఉన్న అక్రమ నిర్మాణాల తొలగింపునకు కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పనులలో ఆశించిన స్థాయిలో పురోగతి రాకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ కోసం సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనులు వేగవంతం కాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, డీఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

'శ్రీ చైతన్య' ఆధ్యాపకురాలికి డాక్టరేట్



రాజేశ్వరిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఖమ్మం రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొన్నెకల్లులోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల ఆధ్యాపకురాలు రాజేశ్వరికి డాక్టరేట్ లభించినట్లు ప్రిన్సిపాల్ మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతు ఇన్స్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ఎంబీఏ అసిస్టెంట్ ప్రొఫెసర్ పెంటాల రాజేశ్వరికి ద్రవిడయన్ యూనివర్సిటి కుప్పంలోని మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్మెంట్ ఇన్‌సెలెక్టెడ్ బ్యాంక్స్ ఇనద తెలంగాణ స్టేట్ అనే అంశంపై, కాకతీయ యూనివర్సిటి ప్రొఫెసర్ డాక్టర్ టి.గోపి పర్యవేక్షణలో సిద్ధాంత పత్రం సమర్పించారు. సీనియర్ ప్రొఫెసర్ బి.శేఖర్, తుమకూర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఫైనల్ వైవ వాయిస్ నిర్వహించగా ద్రవిడయన్ యూనివర్సిటీ కుప్పం, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా డాక్టరేట్ అందుకున్న రాజేశ్వరిని కళాశాల యాజమాన్యం శుక్రవారం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయిగితీక, సుదర్శన్, రాజేష్, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీలకు సామాజిక న్యాయం కల్పించేందుకే

కులగణన: బీజేపీ జిల్లా అధ్యక్షుడు



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ఖమ్మం బైపాస్‌రోడ్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఓబీసీలకు సామాజిక న్యాయం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కులగణను శ్రీకారం చుడుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. జనగణనలో భాగంగా కులగణన కూడా నిర్వహించాలని కేంద్ర కేబినేట్ నిర్ణయించిన నేపథ్యంలో ధన్యవాదాలు తెలుపుతూ నగరంలోని గాంధీచౌక్ నుంచి జిల్లా బీజేపీ కార్యాలయం వరకు శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కులగణనకు శ్రీకారం చుడుతుంటే రాహుల్‌గాంధీ ఏదో ఉద్ధరించినట్లు కాంగ్రెస్ నేతలు సంబరాలు చేయడం సిగ్గుచేటన్నారు. త్వరలో జరగబోయే బీహార్ ఎన్నికల కోసం బీజేపీ కులగణన చేపడుతుందని, మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు బీహార్‌లో ఎప్పుడో కులగణన జరిగిందన్నారు. కేవలం ముస్లిం ఓట్లను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ కులగణన ఊసు ఎత్తలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయ్‌ప్రతాప్, రమేష్, జ్వాల నరసింహారావు, అసెంబ్లీ కన్వీనర్ అంజయ్య, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు టేకుమళ్ల వీరుగౌడ్, నున్నా రవికుమార్, సుధాకర్, రాజేష్, అనిత, రవి రాథోడ్, సుబ్బారావు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కామేపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో నష్టబోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కామేపల్లి, ముచ్చర్ల, జాస్తిపల్లి, బాసిత్‌నగర్ గ్రామాల్లో పంట నష్టాలను పరిశీలించారు. మామిడి తోటను మామిడి కాయలు, బొప్పాయి తోటలు పూర్తిగా విరిగి పడిపోయి రైతులకు భారీ నష్టం వాటిల్లిందని అన్నారు. కళ్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసిపోయిందని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయిందని అన్నారు. రైతులను ఆదుకోవాలని కోరారు.

విద్యా హబ్‌గా ఖమ్మం నగరం

రూ.25లక్షలతో ఫుట్‌పాత్‌లకు శంకుస్థాపన చేసిన మంత్రి



శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే ఖమ్మం నగరం విద్యాహబ్‌గా మారిందని, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, గత ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యాకు బడ్జెట్‌లో నిధులు కేటాయింపు చేశామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పీజీ కాలేజీ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, క్రీడా మైదానం, ఐటీ హబ్ వరకు ఫుట్‌పాత్‌ల నిర్మాణం కోసం రూ.25లక్షలతో చేపట్టనున్న పనులకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే మోడల్ నగరంగా ఖమ్మాన్ని తీర్చిదిద్దేందుకు కావాల్సిన అభివృద్ధి పనులు ప్రణాళిక బద్ధంగా చేస్తున్నామని తెలిపారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఈఈ కృష్ణలాల్, వీవీపాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు, మాజీ కార్పొరేటర్ చావా నారాయణరావు, కాంగ్రెస్ నాయకులు సాధు రమేశ్‌రెడ్డి, నగర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్‌చౌదరి పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయానికి ఉద్యోగుల కేటాయింపు

- ఉత్తర్వులు జారీచేసిన కమిషనర్ అభిషేక్ అగస్త్య
- కేఎంసీలో వలే జోనల్‌లోను అన్ని విభాగాల ఏర్పాటు
- ఇక స్థానికంగానే పౌర సేవలు

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రజల వద్దకే పరిపాలన విధానంతో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య రూపొందించిన జోనల్ కార్యాలయాలకు మరో ముఖ్యమైన అడుగు పడింది. ఇప్పటికే ఉగాది పర్వదినోత్సవం సందర్భంగా పాత మున్సిపల్ కార్యాలయంలో జోనల్ కార్యాలయాన్ని మేయర్ పునుకొల్లు నీరజ, ఉప మేయర్ ఫాతిమాజోహారాతో కలిసి కమిషనర్ ప్రారంబించారు. 16, 18, 24, 25, 26, 37, 38, 39, 40, 42 డివిజన్లు కలిపి నార్త్ జోన్‌గా నామకరణం చేశారు. మిగిలిన మరో నాలుగు కార్యాలయాలు సైతం ప్రారంబానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే ప్రారంభమైన జోనల్ కార్యాలయానికి ఉద్యోగుల కేటాయింపును పూర్తి చేశారు. ఖమ్మం నగర పాలక సంస్థలోని అన్ని విభాగాలను తిరిగి జోనల్ కార్యాలయాల్లో విభాగాలను ఏర్పాటు చేసి ఉద్యోగుల కేటాయింపు ఉత్తర్వులు విడుదల చేశారు. దీంతో జోనల్ వ్యవస్థ నుంచి ఇక పౌర సేవలు అందనున్నాయి.



పాత మునిసిపల్ కార్యాలయంలోని జోనల్ ఆఫీస్

రాహుల్ గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కూసుమంచి, మే 2(ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీ పోరాట ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం కులగణన, జనగణన చేపట్టిందంటూ.. కూసుమంచిలో రాహుల్ గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. రాహుల్ పోరాటం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణను ప్రధాని మోదీ ఆదర్శంగా తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి, సీడీసీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు అభినందన



అభినందిస్తున్న ఎంఈవో

కూసుమంచి, మే 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రకటించిన టెన్త్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కూసుమంచి ఎంఈవో రాయల వీరాస్వామి అభినందించారు. మంచి కోర్సులను ఎంపికచేసుకుని ముందుకు సాగాలని కోరారు.

ధాన్యం కొనేదెప్పుడో..

» వారంరోజులుగా ఎగుమతులు లేక కొనుగోలు కేంద్రాల్లో నిలిచిపోయిన ధాన్యం
» ఇప్పటివరకు 200లారీల ధాన్యం మాత్రమే తరలింపు
» వర్షాలు కురుస్తుండటంతో ఆందోళనలో రైతులు



కల్లాల్లోనే ఉన్న ధాన్యం బస్తాలు

పెనుబల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలంలో రబీలో సుమారు 20వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. అధికారులు ధాన్యం ఎకరాకు సుమారు రెండు మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేయగా అంతకు రెట్టింపు దిగుబడులు రావడంతో ధాన్యం ఎగుమతులు అధికారులకు పెనుభారంగా మారింది. వెయ్యి లారీల ధాన్యాన్ని మిల్లులకు తరలించాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు కేవలం 200లారీల ధాన్యాన్ని మాత్రమే తరలించారని రైతులు వాపోతున్నారు. వారంరోజుల క్రితం కాంటాలు వేసినా ధాన్యం తరలించకపోవడంతో ఒకపక్క అకాల వర్షాలు, మరోపక్క పశువులు, కోతుల నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడం కష్టతరంగా మారిందని రైతులు వాపోతున్నారు. పెనుబల్లి మండలంలో ఐకేపీ ద్వారా 31, సహకార సంఘాల ఆరు కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. కానీ కొన్ని కేంద్రాల నుంచి ఇప్పటివరకు ఒక్క లారీ ధాన్యం కూడా తరలించలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత మూడురోజులుగా కొనుగోలు కేంద్రాలకు నిర్వాహకులు కానీ, పర్యవేక్షకులు కానీ రావడం లేదని దీంతో తమ గోడు ఎవరికి చెప్పుకోలేక తెలియడం లేదని, తమను పట్టించుకొనే వారు ఎవరని రైతులు ప్రశ్నిస్తున్నారు. మండలంలో అత్యధికంగా దిగుబడులు వచ్చే కుప్పెనకుంట్ల, ముత్తగూడెం, కారాయిగూడెం, వీఎంబంజర్ కేంద్రాల్లో ఇంతవరకు ఒక్క లారీ ధాన్యాన్ని కూడా మిల్లులకు తరలించలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము పండించిన పీఆర్ 126 లాంటి సన్నరకం ధాన్యాన్ని కూడా కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేయడం లేదని వాపోతున్నారు. తమ ధాన్యాన్ని కాంటాలు వేసి వెంటనే మిల్లులకు తరలించాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి

● దొంతినేని భాస్కర్‌రావు, రైతు, మొండికుంట



కొనుగోలు కేంద్రాలకు తాము తీసుకువచ్చిన ధాన్యాన్ని నిర్వాహకులు కాంటాలు వేయడం లేదు. ఒకపక్క అకాల వర్షాలు పడుతుండటంతోపాటు మరోపక్క పశువుల, కోతుల నుంచి ధాన్యాన్ని కాపాడుకోవాల్సి వస్తుంది. ఎప్పుడు వర్షం వస్తుందో తెలియక ఆందోళన చెందుతున్నాం. కేంద్రం నిర్వాహకుల వద్ద టార్పాలిన్ పట్టాలు ఉన్నప్పటికీ తమకు ఇవ్వడం లేదు. వెంటనే తమ ధాన్యాన్ని కాంటాలు వేసి మిల్లులకు తరలించాలి.

పీఆర్ 126రకం ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు

● పుల్లూరి నర్సింహారావు, రైతు, రామచంద్రరావుబంజర్



సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ. 500బోనస్ ఇస్తామని అధికారులు చెప్పడం తో తాను పీఆర్ 126రకం ధాన్యాన్ని సాగుచేశాను. తాను పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చాను. కానీ ఈరకం ధాన్యాన్ని కొనమని అంటున్నారు, ఈ వడ్లు ఏం చేయాలో పాలుపోవడం లేదు. గత వారంరోజులుగా ధాన్యాన్ని కాపాడుకొనేందుకు కుటుంబసభ్యులం కేంద్రం వద్దనే పడిగాపులు కాయాల్సి వస్తుంది. అధికారుల అనాలోచిత నిర్ణయాల వలనే తనతోపాటు చాలామంది రైతులం ఈ రకం ధాన్యాన్ని సాగుచేశాము. ఈరకం ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం వల్ల తామంతా తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఈరకం ధాన్యాన్ని కొనుగోలు చేసి తమను ఆదుకోవాలి.

'ఛలో బస్ భవన్‌ను జయప్రదం చేయండి'



మధిరటౌన్‌లో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థతో పాటు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం నేపథ్యంలో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నేడు తలపెట్టిన ఛలో భవన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సత్తుపల్లిలోని ఆర్టీసీ డిపో గేట్ ఎదుట శుక్రవారం వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోవడంతో పాటు సంస్థ పనిభారాన్ని కూడా పెంచుతోందని, ఈ క్రమంలో యాజమాన్యం తీరుకు నిరసనగా నేడు చేపట్టనున్న కార్యక్రమానికి వేలాదిగా తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.రామకృష్ణ, గడ్డం శ్రీనివాసరావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

మధిరటౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): మధిరలోని ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులు ఈ నెల 7 నుంచి తలపెట్టిన సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. ఖమ్మం రీజియన్ జేఏసీ చైర్మన్ పిల్లి రమేష్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని అన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ నిర్వహిస్తున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు తిమ్మినేని రామారావు, రాంచంద్రరావు, లాజర్, వెంకటేశ్వర్లు, గోపాలరావు, కృష్ణారావు తదితరులున్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు: డీఈ

కల్లూరు, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు సత్తుపల్లి డివిజనల్ ఇంజనీర్ రాములు అన్నారు. శుకవారం మండల పరిధిలోని పెద్దకోరుకొండిలోని విద్యుత్ ఉపకేంద్రంలో వీసీబీ బ్రేకర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ ఉపకేంద్రంలో వేసవి కార్యచరణ ప్రణాళికలో భాగంగా సుమారు రూ.8 లక్షల అంచనాతో ఈ బ్రేకర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ పరిశ్రమలకు, వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఈ వీసీబీ బ్రేకర్ అనుసంధానం చేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ సతీష్, ఏఈ రామిరెడ్డి సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

సత్తుపల్లిరూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జవహర్ నగర్‌కు చెందిన తాపీ పని కార్మికుడు కలపాల నాగేంద్ర పెరాలసిస్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని ఆర్‌కే ఫౌండేషన్ ద్వారా తెలుసుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు కంభంపాటి వెంకటేష్ తన మిత్రుడు గాదె ప్రభాకర్‌రెడ్డి ద్వారా రూ.2వేలు ఆర్థిక సహాయాన్ని నాగేంద్రకు అందజేశారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు: ఎస్ఐ



ఎర్రుపాలెం, మే 2(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక, బియ్యం రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎర్రుపాలెం ఎస్ఐ ఎం. రమేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలపై ప్రత్యేక శ్రద్ధతో పాటు అక్రమరవాణాపై ఉక్కుపాదం మోపుతానని హెచ్చరించారు. ఖమ్మంత్రీటౌన్ ఎస్ఐగా పనిచేస్తూ ఎర్రుపాలేనికి బదిలీపై వచ్చినట్టు తెలిపారు.

ఏన్కూరు ఎంపీడీవోగా నారాయణ

ఏన్కూరు, మే2(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు నూతన ఎంపీడీవోగా జీవీఎస్ నారాయణ శుక్రవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఎంపీవోగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న నారాయణకు ఇటీవల కల్లూరు డీఎల్‌పీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. తాజాగా శుక్రవారం ఏన్కూరు ఎంపీడీవోగా మరో అదనపు బాధ్యతను అప్పగించారు. ఇక్కడ విధులు నిర్వహించిన రమేష్ ఏప్రిల్ 30న పదవీ విరమణ పొందారు.

డ్రైనేజీ పనుల ప్రారంభం

మధిరటౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో రూ.128 కోట్లతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గత నెల 13న మధిర మెయిన్ రోడ్డులో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎట్టి పరిస్థితుల్లో మే మొదటి వారంలో పనులు ప్రారంభం కావాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడమే కాకుండా, రెండేళ్లలో పనులు పూర్తిచేసేలా చూడలని అన్నారు. పాత డంపింగ్ యార్డు నుంచి డ్రైనేజీ పైపులు వేసేందుకు సిమెంట్ రోడ్డు కటింగ్ పనులను ప్రారంభమయ్యాయి.

తరుగు లేకుండా ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ అనంతరాజు

చింతకాని, మే 2(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో కొ నుగోలు చేసిన ధాన్యాన్ని ఎలాంటి తరుగు లేకుండా మిల్ల ర్లు దిగుమతి చేసుకోవాలని తహసీల్దార్ కూరపాటి అనంతరాజు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో చింతకాని నాగులవంచ సహకార సంఘం సీఈవోలు, ఐకేపీ అధికారులు, మిల్లర్లతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. మండలంలో ఉన్న మిల్లులకు కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని దిగుమతి చేయాలని ఎలాంటి తరుగు లేకుండా మిల్లర్లు దిగుమతి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో చింతకాని, నాగులవంచ సొసైటీ సీఈవోలు మారగాని శ్రీనివాసరావు, యాలమూడి శ్రీనివాసరావు, ఐకేపీ ఏపీఎం బొమ్మా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలి

» ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి



ప్రసంగిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

వైరా, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల విస్తృత ప్రచారం చేస్తూ, కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత సంస్థాగతంగా పటిష్ఠం చేయాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అధ్యక్షతన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా అబ్జర్వర్లలో ఒకరైన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, బత్తిని శ్రీనివాస్, పులి అనిల్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణ, స్వర్ణ నరేందర్, మంగీలాల్‌నాయక్, తలారి చంద్రప్రకాష్, పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణప్రసాద్, కట్ల రంగారావు, దాసరి దానియేలు, అశోక్, మంజుల పాల్గొన్నారు.

సర్వేలు పూర్తికాగానే ఇందిరమ్మ ఇళ్లు

సత్తుపల్లిరూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సర్వేలు పూర్తికాగానే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తుందని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వెంగళరావు నగర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, నాయిని రాజేంద్రరెడ్డిలతో కలిసి ఎగురవేశారు.

అంతకముందు పట్టణంలోని జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘం నిదులు రూ.37లక్షలతో నూతనంగా నిర్మించనున్న పబ్లిక్ టాయిలెట్స్ (లేడీస్, జంట్స్) నిర్మాణానికి ఆయన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి శంకుస్థాపన చేశారు. కళాశాలలో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ జలగం వెంగళరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కళాశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం రూసా నిధులు కింద మంజూరైన రూ.95లక్షల మంజూరు పత్రాన్ని పూర్వ విద్యార్థుల సంఘ బాధ్యులు డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్‌కు ఎంపీ అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కొండ్రా నర్సింహ, ప్రిన్సిపాల్ డా.నంద్రు గోపి, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మార్ గార్డెన్స్‌లో సత్తుపల్లి, వేంసూరు మండలాలకు చెందిన 134మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

సీసీ పనులకు శంకుస్థాపన

పెనుబల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలం ముత్తగూడెం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ముత్తగూడెం గ్రామంలో ఎంపీ ల్యాడ్స్ రూ.9లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్, కల్లూరు ఏఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్ బాగం నీరజప్రభాకర్, రాచబోయిన కోటేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పసుమర్తి విశ్వనాథ్, పెనుబల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, గూడూరు మాధవరెడ్డి, కమలాకర్ పాల్గొన్నారు.

కుటుంబాలకు పరామర్శ

తల్లాడ, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపురం,అన్నారుగూడెం గ్రామాల్లో మృతుల కుటుంబాలను శుక్రవారం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పరామర్శించారు. రామచంద్రాపురంలో పులి కనకదర్గయ్య, అన్నారుగూడెంలో బయ్యవరపు దర్గయ్య కుటుంబాలను పరామర్శించారు. కనకదర్గయ్య కుమారుడు సీనియర్ జర్నలిస్టు కృష్ణార్జునరావుకు సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలోజిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి నాయిని రాజేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాయల రాము, తుమ్మలపల్లి రమేష్, గో విందు శ్రీనివాసరావు(ట్రాక్టర్), రావుల గోపిగౌడ్, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కల్లూరు, మే2 ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలో శుక్రవారం ఎంపీ రఘురాంరెడ్డి వచ్చిన సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎంపీ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో పసుమర్తి చందర్‌రావు, యాసా శ్రీకాంత్, కిషోర్‌దత్, జంగం నరిసింహారావు, శ్రీను, వీరేంద్ర తదితరులు ఉన్నారు.



జేవీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

రైతుల ఇబ్బందులను తొలగించాలి

» సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కొణిజర్ల, మే 2(ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నది మిల్లర్ల కోసమో, రైతుల కోసమో అర్థం కావడంలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తాళ్ళపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, చింతపల్లి ప్రసాద్, హరిచంద్, సత్యనారాయణ, జట్ల రవికుమార్ నంద్యానాయక్, నరసింహరావు, భిక్షం, కనకయ్య, లక్ష్మణాచారి, బుజ్జి, శివ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో...



ధాన్యాన్ని పరిశీలిస్తున్న గోపాలరావు

వైరా, మే 2 (ఆంధ్రజ్యోతి): తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు కోరారు. మండలంలోని పలుచోట్ల వర్షానికి తడిసిన ధాన్యాన్ని శుక్రవారం సీపీఐ అనుబం ధ రైతుసంఘం నాయకులు పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల వడగండ్ల వర్షాలు, భారీ వర్షాలు కురుస్తూ రైతులు కల్లాలు, రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసిపోయి నష్టపోతున్నారని ఆవేద న వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రేమల్లె నారాయణ, మిట్టపల్లి రాఘవరావు, గారపాటి అశోక్, మోట కొండా, షరీఫ్, రాంబాబు, తిరుమలయ్య, డేవిడ్‌రాజు, హరీష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామి దశాబ్ది ఉత్సవాలు



మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ముదిగొండ, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాణాపురం గ్రామంలో శ్రీకంఠమహేశ్వరస్వామి దశాబ్ది ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మృత్యుంజయహోమం నిర్వహించారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

బోనకల్, మే 2 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని తహసీల్దార్ పున్నం చందర్ తెలిపారు. మండలంలోని ముష్టికుంట్ల, జానకీపురం గ్రామాల్లో శుక్రవారం మాఇంటి-మణిదీపం కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లల తల్లిదండ్రులను సన్మానించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు ఆడపిల్లల తల్లిదండ్రులను సన్మానిస్తున్నామని తెలిపా రు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.రమాదేవి, గిర్దావర్ మైథిలి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సుజాత, రమాదేవి, ఎంఈవో దామాల పుల్లయ్య, అంగన్‌వాడీ టీచర్లు షేక్.చాంద్‌సారా, విజయలక్ష్మి, నిర్మల పాల్గొన్నారు.



ఆడపిల్ల తల్లిదండ్రులను సన్మానిస్తున్న తహసీల్దార్ చందర్

డిప్యూటీ సీఎం భట్టి పర్యటనను విజయవంతం చేయాలి

ముదిగొండ, మే 2 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలంలో శనివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటించనున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని పమ్మి, బాణాపురం, వల్లభి, చిరుమర్రి, ముదిగొండ తదితర గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేస్తారని ఈ పర్యటనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తు న పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శ్రమశక్తి అవార్డు రావడం అభినందనీయం



రాములను సన్మానిస్తున్న నాయకులు

కొణిజర్ల, మే 2(ఆంధ్రజ్యోతి): కొణిజర్లకు చెందిన ఐఎన్‌టీయూసీ మిషన్ భగీరథ విభాగం ఉమ్మడి తెలుగురాష్ట్రాల కార్యదర్శి అ యిన తలారి రాములకు రాష్ట్రప్రభుత్వం నుంచి శ్రమశక్తి అవార్డు అందడం అభినందనీయం అని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు తెలిపారు. మేడే రోజు రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వ కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషో ర్ నుంచి శ్రమశక్తి అవార్డు అందుకున్నారు. శుక్రవారం రాములును శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ నెల్లూరి రమేష్, కొనతం ఉమాశంకర్, రేపాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండలో అకాల వర్షం

ముదిగొండ, మే 2 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ



ముదిగొండలో నేలరాలిన మామిడికాయలు

మండలంలో గురువారం అర్ధరాత్రి అకస్మాత్తుగా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షానికి మామిడి, ధాన్యం రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో మామిడికాయలు నేలరాలి పనికి రాకుండా పగిలిపోయాయి. మామిడికాయలు పగిలిపోవడంతో మార్కెట్ విక్రయించేందుకు పనికిరాకుండా పోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం రాశులపై పట్టాలు కప్పినప్పటికీ ఈదురుగాలుల కారణంగా అవి లేచిపోవడంతోపాటు వర్షపు నీరు పట్టాల కిందకు చేరడంతో ధాన్యం తడిసిపోయింది.

స్త్రీశక్తి టీస్టాల్ ప్రారంభం

బోనకల్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో ఐకేపీ, గీతాంజలి గ్రామసమాఖ్య ఆధ్వర్యంలో షేక్.పర్వీన్ ఏర్పాటుచేసిన స్త్రీశక్తి టీస్టాల్‌ను శుక్రవారం తహసీల్దార్ పున్నం చందర్ ప్రారంభించారు. ఐకేపీ ద్వారా ఇచ్చిన రుణాలతో స్వయం శక్తితో ఎదిగేందుకు టీస్టాల్ పెట్టుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో దామాల పుల్లయ్య, ఏపీఎం కట్టా సురేందర్‌బాబు, సీసీలు శోభ, వెంకటేశ్వర్లు, శివయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



టీస్టాల్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

లయన్స్‌క్లబ్ కార్యవర్గం ఎంపిక



నూతన లయన్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు

కల్లూరు, మే 2(ఆంధ్రజ్యోతి): కల్లూరు లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎంపికను శుక్రవారం లయన్స్‌క్లబ్ రీజినల్ చైర్మన్ చలువాది నగేష్ కుమార్ నిర్వహించారు. అధ్యక్షుడిగా ఇందోజు రమేష్, ఉపాధ్యక్షుడిగా రాయల మురళీధర్‌రావు, కార్యదర్శిగా కిన్నెర ఆనందరావు, కోశాధికారిగా దారా శ్రీనువాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని గంగుల నారాయణరావు, చారుగుండ్ల అచ్యుత సీతారామారావు, అప్పలనాయుడు, చిన్నశ్రీను, వెంకటేశ్వరరావులు అభినందించారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

తల్లాడ, మే 2(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి వర్గం తీసుకున్న జనగణన, కులగణన నిర్ణయాన్ని హర్షిస్తూ శుక్రవారం తల్లాడలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఈవీ రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గాదె కృష్ణారావు, బీజేపీ మండల అధ్యక్షుడు చల్లా నాగులు, మండల నాయకులు తేజావత్ బాలాజీనాయక్, రాయల రమేష్, నరేష్, సాయిం చందు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఉద్యోగుల నిరసన

మధిరరూరల్/కల్లూరు, మే 2(ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగులకు పేస్కేల్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీపథకంలో పనిచేసే ఉద్యోగులు శుక్రవారం ఆయా మండల పరిషత్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీపథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు గడిచిన మూడునెలలుగా జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా కార్యక్రమాలలో ఏపీవో హేమమాలిని, టెక్నికల్ అసిస్టెంట్లు మురళి, ముత్తయ్య, ఆవుల సంతోష్, బొల్లెద్దు విజయ్‌కుమార్, రేలచర్ల అనిల్‌కుమార్, వేల్పుల ముత్తయ్య, శాంతయ్య, సుగ్గల గిరీష్, సుజాత పాల్గొన్నారు.



నిరసన తెలపుతున్న ఉపాధి సిబ్బంది